స్నేహమేరా శాశ్వతం

- కష్టసుఖాల్లో తోడుండే వారే నిజమైన స్నేహితులు
- నిజమైన స్నేహంలో ఈర్ష్య, ద్వేషాలకు తావులేదు
- నేడు స్నేహితుల దినోత్సవం



... కథనం 8వ పేజీలో

నేతన్నల జీవితాల్లో వెలుగు

చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్



నేత పనిలో నిమగ్నమైన కార్మికుడు

- జిల్లాలో 560 మందికి ప్రయోజనం
- ఈ నెల 1 నుంచే అమల్లోకి..
- హామీని నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం
- నేత కార్మికుల ఆనందోత్సాహం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం ఆపన్న హస్తం అందించింది. ఆర్థికంగా చితికిపోయిన వారి బతుకుల్లో వెలుగులు నింపింది. పవర్‌లూమ్స్‌కు 500, హ్యాండ్‌లూమ్స్‌కు 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా ఇస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించడంతో జిల్లాలోని చేనేత కార్మికుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

ఎన్నికల ముందు కూటమి నాయకులు చేనేత కార్మికులకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంది. ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్‌పై ఆమోద ముద్ర వేసిన సంగతి తెలిసిందే. యువగళం పాదయాత్ర సమయంలో పాయకరావుపేటలో చేనేత కార్మిక కుటుంబాలతో జరిగిన ఆత్మీయ సమావేశంలో నేతన్నల అభ్యర్థన మేరకు ఉచిత విద్యుత్‌పై నారా లోకేశ్ హామీ ఇచ్చారు. తాజాగా అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు నేతన్నల ఇళ్లకు ఉచితంగా 200 యూనిట్లు, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించనున్నట్టు ప్రకటించడంతో ఆయా వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో పవర్‌లూమ్స్ వినియోగించే చేనేత కుటుంబాలు లేకపోయినా ఇంటి వద్దే మగ్గాలపై చేనేత పనులు చేసుకొనే కుటుంబాలు సుమారు 850 వరకు ఉన్నాయి. సుమారు 560 మంది మగ్గాలను వినియోగిస్తున్నారు. వీరికి ప్రభుత్వం ప్రకటించిన విధంగా ప్రతి నెలా 200 యూనిట్లు ఉచితంగా అందించనున్నది. వాస్తవానికి జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కుటుంబాలకు ఈ నెల 7వ తేదీ నుంచి ఉచిత విద్యుత్ అందించాలని తొలుత నిర్ణయించినా, సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు వారం రోజుల ముందు అంటే ఈ నెల 1వ తేదీ నుంచే ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం నేతన్నలకు నెలకు కేవలం 100 యూనిట్లు విద్యుత్ మాత్రమే ఉచితంగా అందించగా, కూటమి ప్రభుత్వం 200 యూనిట్లు వరకు ఉచితంగా ఇస్తుండడంతో ప్రతి కుటుంబానికి నెలకు రూ.950 నుంచి రూ.1,250 వరకు లబ్ధి చేకూరనున్నదని

... మిగతా 8వ పేజీలో

ఆర్థిక భారం తగ్గుతుంది



గతంలో ఉచితంగా ఇచ్చిన 100 యూనిట్లు సరిపోయేవి కాదు. అదనంగా బిల్లులు చెల్లించుకోవాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకొని ఉచితంగా నెలకు 200 యూనిట్లు అందించడం వల్ల మాకు ఆర్థిక భారం తగ్గనుంది. ప్రభుత్వ సహాయానికి చేనేత కుటుంబాలు రుణపడి ఉంటాయి,

- కర్రా వీరభద్రరావు, వీవర్స్ కాలనీ, పాయకరావుపేట

చేనేత కార్మికులకు చేయూత



ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకుంటోంది. నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తుండడం వలన మాకు ఎంతో మేలు జరుగుతుంది. మగ్గంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మాలాంటి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గుతుంది.

- అక్కాల అచ్చిరాజులు, చేనేత కార్మికురాలు, వీవర్స్ కాలనీ, పాయకరావుపేట

నంబర్ వన్ నానాజీ

కానిస్టేబుల్ పరీక్షల్లో రాష్ట్రంలో ప్రథమ స్థానం

- మెరిసిన పేదింటి రత్నం
- తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు
- సోదరుడు ఎలక్ట్రీషియన్
- వారి కష్టంతో పట్టుదలగా చదివి అత్యుత్తమ ఫలితం
- ఎస్ఐ పరీక్షతో పాటు గ్రూప్-1కు సన్నద్ధం

అచ్యుతాపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):



నానాజీ

'ఒకటే జననం.. ఒకటే మరణం.. ఒకటే గమనం.. ఒకటే గమ్యం.. గెలుపు పొందు వరకూ అలుపు లేదు మనకు..' అన్నాడో సినీ కవి. అక్షరాలా అదే పట్టుదలతో చదివి కానిస్టేబుల్ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో ప్రథమంలో నిలిచాడు అచ్యుతాపురం మండలం దొప్పెర్లకు చెందిన గండి నానాజీ. పేదింట పుట్టిన ఈ విద్యా కుసుమం ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని అత్యుత్తమ ఫలితాన్ని సాధించాడు.

మండలంలోని దొప్పెర్ల గ్రామానికి చెందిన అయ్యబాబు, జయమ్మదంపతులకు ఇద్దరు కుమారులు. వ్యవసాయ కూలి పనులు చేస్తూ ఇద్దరు కుమారులను చదివించారు. పెద్ద కుమారుడు ఎలక్ట్రీషియన్‌గా చేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలిచాడు. రెండవ కుమారుడు నానాజీ చిన్నప్పటి నుంచి చదువులో ముందంజలో ఉండేవాడు. దీంతో నానాజీని బాగా చదివించాలని తల్లిదండ్రులు ఎక్కువగా కష్టపడే వారు. వ్యవసాయ కూలి పనులు సంవత్సరంలో

... మిగతా 8వ పేజీలో



మాకవరపాలెం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో రైతులకు నమూనా చెక్కు అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

అన్నదాతకు భరోసా

అన్నదాత సుఖీభవ పథకం కింద జిల్లాకు రూ.161.45 కోట్లు విడుదల

- 2,42,536 మంది రైతులకు లబ్ధి

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం జిల్లా వ్యాప్తంగా శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడు పాల్గొని రైతులకు నమూనా చెక్కు అందజేశారు. అనకాపల్లిలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కలెక్టర్ విజయకృష్ణన్, ఎలమంచిలి మండలం రామారాయుడుపాలెంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు పాల్గొన్నారు. మాడుగుల నియోజకవర్గం దేవరాపల్లిలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, పెందుర్తి నియోజకవర్గం సబ్బవరంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, చోడవరం నియోజకవర్గం రావికమతంలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లిలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు పాల్గొని రైతులకు నమూనా చెక్కులు అందజేశారు.

జిల్లాలో 2,42,536 మంది రైతులకు లబ్ధి

జిల్లాలో 2,42,536 మంది రైతులకు కూటమి ప్రభుత్వం రూ.161.45 కోట్లు మంజూరు చేసింది. లబ్ధిదారులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం తొలి విడత కింద రూ.7 వేలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు.



అనకాపల్లిలో రైతులకు నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్



నిండుకుండలా ఉన్న తాండవ రిజర్వాయర్

10న తాండవ నీరు విడుదల

నాతవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):

ఖరీఫ్ సాగు కోసం ఈ నెల 10న తాండవ నీరు విడుదల చేయనున్నట్టు తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ శనివారం తెలిపారు. తాండవ రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా, ప్రస్తుతం 371 అడుగుల నీటి నిల్వలు ఉన్నాయన్నారు. ఈ నెల 10న జల హారతి ఇచ్చి స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా తాండవ నీరు విడుదల చేయనున్నట్టు ఆయన చెప్పారు. ప్రస్తుతం తాండవలోకి 220 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ద్వారా వస్తుందన్నారు. ఈ నీరు కుడి, ఎడమ కాలువల ద్వారా సాగుకు సరఫరా చేస్తే 52 వేల ఎకరాలకు 70 రోజులు సరిపోతుందన్నారు. రానున్న కాలంలో వర్షాలు పడడం వలన ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు ఢోకా ఉండదని తాండవ డీఈఈ అనురాధ తెలిపారు.

'ది డెక్'లో రైల్వే జోన్ కార్యాలయం

- 6, 7 అంతస్థుల కేటాయింపు
- వచ్చే వారం ఎంఓయూ: ఎంపీ శ్రీభరత్



రైల్వే జోన్ కార్యాలయం ఏర్పాటు చేసేది ఇక్కడే..

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):

విశాఖ కేంద్రంగా ప్రకటించిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయం ఎక్కడ నిర్వహించాలనేది ఎట్టకేలకు ఖరారైంది. సిరిపురం జంక్షన్‌లో వీఎంఆర్‌డీఏ నిర్మించిన 'ది డెక్' భవనంలో జోన్ జనరల్ మేనేజర్ కార్యాలయం ఏర్పాటుచేయడానికి గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఇందులో 6, 7 అంతస్థులను (సుమారు 41,500 చ.అ.) కేటాయించడానికి వీఎంఆర్‌డీఏ సుముఖత వ్యక్తంచేసింది. వాస్తవానికి గత నెలలోనే రైల్వే అధికారులు వీఎంఆర్‌డీఏ నుంచి వివరాలు తీసుకొని, ఢిల్లీలోని రైల్వే బోర్డుకు పంపించారు. కానీ దానిని వారు పట్టించుకోలేదు. ఇటీవల దీనిపై 'రైల్వే జోన్‌కు రెడ్ సిగ్నల్స్' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించగా పార్లమెంటు సమావేశాలకు ఢిల్లీ వెళ్లిన విశాఖ ఎంపీ శ్రీభరత్ అక్కడి రైల్వే బోర్డు అధికారులతో మాట్లాడారు. వెంటనే కార్యాలయం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కోరారు. దాంతో బోర్డు అధికారులు విశాఖ నుంచి వెళ్లిన ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. అప్‌సెట్ ధర అంటే చ.అ. రూ.70 చొప్పున ఇవ్వడానికి వీఎంఆర్‌డీఏ అంగీకరించింది.

వారం రోజుల్లో ఎంఓయూ: శ్రీభరత్

ది డెక్‌లో జోనల్ కార్యాలయం ఏర్పాటుకు సంబంధించి వారం రోజుల్లో వీఎంఆర్‌డీఏ, రైల్వే మధ్య ఎంఓయూ జరుగుతుందని, ఆ తరువాత ఇంటీరియర్ పనులు ప్రారంభించి కార్యాలయం ప్రారంభిస్తారని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. జోన్ గెజిట్ నోటిఫికేషన్, జోన్ ఆపరేషన్ తేదీ కూడా త్వరలోనే వస్తుందన్నారు.

వణికిస్తున్న వైరల్ జ్వరాలు

- కోటవురట్ల మండలంలో జ్వర పీడితులు అధికం
- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

కోటవురట్ల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి):

మండలంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు రోజూ 250 నుంచి 300 మంది వస్తుండగా, వారిలో జ్వర పీడితులే ఎక్కువ మంది ఉంటున్నారు.



కోటవురట్ల ఆస్పత్రి ఓపీ వద్ద జ్వర పీడితులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు

మండలంలోని రాజుపేటతో పాటు శివారు రామన్నపాలెం, రామచంద్రపాలెం, కె.వెంకటాపురం గ్రామాల్లో ప్రతి ఇంట్లో జ్వర బాధితులు ఉంటున్నారు. చాలా మందికి డెంగ్యూ లక్షణాలు ఉండడంతో నర్సీపట్నం, విశాఖపట్నంలోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్టు ఆయా గ్రామస్థులు చెబుతున్నారు. కోటవురట్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నెల రోజుల్లో 428 మంది చికిత్స పొందారు. ఇటువంటి జ్వరాలు గతంలో ఎన్నడూ చూడలేదని వృద్ధులు చెబుతున్నారు. దీనిపై స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ వివరణ కోరగా వాతావరణంలో మార్పుల కారణంగా వైరల్ జ్వరాలు వస్తున్నాయన్నారు. గ్రామాల్లో తాగునీరు కలుషితం కావడం, పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో వైరల్ జ్వరాలు వస్తున్నట్టు ఆయన చెప్పారు. వారం రోజుల నుంచి ఆస్పత్రి ఓపీ సంఖ్య రోజుకు 250 నుంచి 300 వరకు నమోదవుతోందన్నారు. ప్రజలు వేడి పదార్థాలు తీసుకోవాలని, వేడి చేసి చల్లార్చిన నీరు తాగాలని ఆయన సూచించారు.

ఆర్ఈసీఎస్ ఉద్యోగులకు షాక్

అడ్డగోలు ఇంక్రిమెంట్లు కట్

- 53 మందికి జీతాలు తగ్గింపు
- ఇప్పటివరకూ తీసుకున్న మొత్తం రికవరీపై కసరత్తు
- నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చిన పదోన్నతులపైనా దృష్టి



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (ఆర్ఈసీఎస్)లో అడ్డగోలుగా పదోన్నతులు, ఇంక్రిమెంట్లు పొందిన వారిపై చర్యలు మొదలయ్యాయి. ఆలస్యంగా మేల్కొన్న అధికారులు 53 మంది అక్రమార్కులు ఉన్నట్టు తేల్చి వారి జీతాల్లో కోత విధించారు. ఆగస్టు ఒకటో తేదీన బ్యాంకులో పడిన జీతాలు చూసుకున్న ఆయా ఉద్యోగులు ఒక్కొక్కరికి రూ.10 వేలు నుంచి రూ.15 వేలు కోత పడినట్టు గుర్తించి లబోదిబోమంటున్నారు.

అనకాపల్లి ఆర్ఈసీఎస్‌లో చాలాకాలంగా అక్రమాలు జరుగుతున్నాయి. వాటిని 'ఆంధ్రజ్యోతి' ఎప్పటికప్పుడు వెలుగులోకి తెస్తున్న సంగతి తెలిసిందే. గత మే నెలలో నిబంధనలకు విరుద్ధంగా కొత్త పీఆర్‌సీ ప్రకారం అందరికీ జీతాలు పెంచేశారు. సహకార శాఖ కమిషనర్ అనుమతి లేకుండానే పాత తీర్మానం ప్రకారం జీతాలు ఇచ్చేశారు. దీనిపై విచారణ జరుగుతోంది. ఇదే సమయంలో కొందరు అడ్డగోలుగా పదోన్నతులు, ఇంక్రిమెంట్లు తీసుకున్నారని ఫిర్యాదు అందడంతో దానిపై ఈపీడీసీఎల్ అధికారులు విచారణ చేపట్టారు. కొందరు సస్పెన్షన్ కాలంలో కూడా ఇంక్రిమెంట్లు తీసుకున్నట్టు గుర్తించారు. అలాగే నాలుగేళ్లకు ఒకసారి పదోన్నతి ఇవ్వాలనేది నిబంధన కాగా కొందరు రెండేళ్లకే తీసుకున్నట్టు తేలింది. సహకార శాఖ పరిధిలో సంస్థ నడిచినప్పుడు నాటి మేనేజింగ్ డైరెక్టర్, ప్రాజెక్టు ఇంజనీర్ కలిసి వారికి నచ్చినట్టు చేశారని తేలింది. కొందరు రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి వారు కోరుకున్న పదోన్నతులు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో

... మిగతా 8వ పేజీలో

పోలవరం కాలువ పనులు చకచకా

- చురుగ్గా 6, 7 ప్యాకేజీ కాలువ పనులు

నక్కపల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి):

పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు జోరుగా సాగుతున్నాయి. పాయకరావుపేట మండలం రేఖవానిపాలెం 111వ కిలోమీటరు నుంచి నక్కపల్లి మండలం దార్లపూడి 136.8వ కిలోమీటరు వరకు పోలవరం ప్రాజెక్ట్ ఆరవ ప్యాకేజీ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. దార్లపూడి నుంచి విశాఖపట్నం వరకు ఏడవ ప్యాకేజీ పనులు కూడా మొదలయ్యాయి. నక్కపల్లి మండలం జి.జగన్నాథపురం, రమణయ్యపేట, చినదొడ్డిగల్లు, సీతంపాలెం, ఎస్.రాయవరం మండలం దార్లపూడి గ్రామాల మీదుగా వున్న పోలవరం ఎడమ ప్రధాన కాలువలో పలు యంత్రాలతో పనులు శరవేగంగా సాగుతున్నాయి. దాదాపు ఆరేళ్లపాటు ఆలనాపాలనా లేని పోలవరం ఎడమ ప్రధాన కాలువలో గట్ల నిర్మాణం, సూపర్ పాసేజ్‌లు, వంతెనలు, అండర్ టన్నల్ నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. కాలువలో నీరు నిల్వ వుండడానికి, ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పలు చోట్ల కాలువ గట్లను పటిష్ఠపరిచే పనులు జరుగుతున్నాయి. కాలువలో నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా యంత్రాలతో చదును చేస్తున్నారు. ఈ పనులు సెప్టెంబరు నెలాఖరు నాటికి పూర్తవుతాయని పోలవరం ఎడమ ప్రధాన కాలువ డీఈ గోపాలకృష్ణ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.



సీతంపాలెం వద్ద జరుగుతున్న పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు

సాగుకు సర్కారు సాయం

▸▸ 'అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్' ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్, రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వరరావు

ఎలమంచిలి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తున్నట్టు ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. మునిసిపాలిటీ పరిధి రామారాయుడుపాలెంలో శనివారం అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులకు అన్ని విధాలా తోడ్పాటు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. వ్యవసాయ పరికరాలు, బ్యాంకుల రుణాలు అందించడంతో పాటు పెట్టుబడులకు ఈ రకంగా సాయం అం దిస్తుండడం గొప్ప విషయంగా పేర్కొన్నారు. నియోజకవర్గంలో 33,731 మంది రైతులకు రూ.22.42 కోట్లు వారి ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి వనరులను విస్మరించడంవల్ల రైతులకు ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి తలెత్తకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు చర్యలు చేపడుతున్నారన్నారు. అన్నదాతలు వీటిని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. అంతకు ముందు ప్రగడ, విజయ్‌కుమార్‌లు పంట పొలంలో దిగి యంత్రంతో వరినాట్లు వేశారు. డ్రోన్ ద్వారా మందు పిచికారీని పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంటల సాగు గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డూమా పీడీ సందీప్, ఏడీవో జాహ్నవి, ఏవో మోహన్‌రావు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన సన్యాసినాయుడు, కూటమి నాయకులు గొర్లె నానాజీ, ఆదిమూర్తి, కొఠారు సాంబ, కరణం రవికుమార్, బొద్దపు రమణ, ఆడారి రమణబాబు, మజ్జి రామ్మకృష్ణ, గొర్లె బాబూరావు పాల్గొన్నారు.


పథకం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు, చిత్రంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్


యంత్రం ద్వారా నాట్లు వేస్తున్న ఎమ్మెల్యే

పట్టణంలో తరచూ పైప్‌లైన్ల లీకులు

▸▸ ఇబ్బందులు పడుతున్న జనం

▸▸ ప్రత్యేక దృష్టిసారించని మునిసిపల్ అధికారులు


చిల్లీస్ దాబా సమీపంలో పైప్‌లైన్ దెబ్బతినడంతో వృథాగా పోతున్న నీరు



ఎలమంచిలి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలో ఇటీవల కాలంలో తరచూ తాగునీటి ప్రధాన పైప్‌లైన్లు లీకవుతుండడంతో పెద్ద ఎత్తున నీరు వృథాగా పోతోంది. ఫలితంగా పట్టణ ప్రజలకు నీటి సరఫరాలో రోజుల తరబడి ఇబ్బందులు తప్పడం లేదు. శనివారం మరోసారి పట్టణంలోని చిల్లీస్ రెస్టారెంట్ సమీపంలో ప్రధాన రోడ్డు ప్రక్కన ప్రధాన పైప్‌లైన్ దెబ్బతిని నీరు వృథాగా పోయింది. వారం క్రితం ఇదే ప్రదేశంలో పైప్‌లైన్ దెబ్బతినడంతో మరమ్మతులు చేపట్టారు. మళ్లీ సమస్య మొదటికి రావడం విశేషం. ఎలమంచిలి గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో సుమారు 30 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన పైప్‌లైన్లు కావడం వల్లే తరచూ ఇటువంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఈ కారణంగా పూర్తిస్థాయిలో తమకు నీరు అందడం లేదని పట్టణవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై మునిసిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాల్సిందిగా అంతా కోరుతున్నారు. ఇదిలా వుంటే, శనివారం ఉదయం దెబ్బతిన్న పైపులైన్‌కు మరమ్మతు పనులు పూర్తి చేశామని మునిసిపల్ ఏఈ గణపతి సుబ్బారావు తెలిపారు. పైప్‌లైన్ ప్యాకింగ్ షీట్ వదిలేయడం వల్లే సమస్య ఏర్పడిందన్నారు.

'ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి'


పునశ్చరణ తరగతులు పరిశీలిస్తున్న ఇంటర్మీడియట్ జిల్లా అధికారి వినోద్‌బాబు

ఎలమంచిలి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జిల్లాలోని గణిత శాస్త్ర అధ్యాపకులకు ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా అధికారి ఎం.వినోద్‌బాబు హాజరై అధ్యాపకులకు దిశానిర్దేశం చేశారు. తరగతి గదిలో విద్యార్థులకు ఏవిధంగా విద్యాబోధన చేపట్టాలో వివరించారు. ఈ ఏడాది మంచి ఫలితాలు సాధించేందుకు అంతా కృషి చేయాలన్నారు. పరవాడ కళాశాల అధ్యాపకుడు సాంబశివరావు, నర్సీపట్నం కళాశాల అధ్యాపకుడు వెంకటేశ్వరరావు శిక్షకులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'నియోజకవర్గంలో పారిశుధ్యానికి తొలి ప్రాధాన్యం'

అచ్యుతాపురం ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో పారిశుధ్యానికి తొలిప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ అన్నారు. మండలంలోని మార్టూరులో రూ.30 లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ పనులకు శనివారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. అచ్యుతాపురంలో కూడా పారిశుధ్యం మెరుగు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. అంతా సహకరించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బైలపూడి శ్రీరామదాసు, కేకేవీ హరిబాబు, కె.రమేష్‌బాబు, కేవీరమణ, జి.గోవింద్, కె.హరీష్ తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి : జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా హరిపురం వద్ద చేపడుతున్న తాగునీటి పైప్‌లైన్ పనులను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. పల్లెల్లో తాగునీటి సమస్య తలెత్తరాదన్న లక్ష్యంతో ఉన్నట్టు చెప్పారు. ఎటువంటి సమస్యలు ఉన్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు వి.దిన్‌బాబుతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం


ఎలమంచిలి పాతవీధిలఅంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సీడీపీవో ఇందిరాదేవి

ఎలమంచిలి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేష్ఠమని, ముర్రుపాలతో తల్లిబిడ్డ ఎంతో ఆరోగ్యకరంగా ఉంటారని సీడీపీవో కె.ఇందిరాదేవి అన్నారు. మునిసిపాలిటీ పరిధి పాతవీధి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు శనివారం ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. బాలింతలు ముర్రుపాలను మాత్రమే బిడ్డకు అందించాలని అప్పుడే వారిలో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్ : శిశువుకు తల్లిపాల అందిస్తే వారికి అమృతంలా పనిచేస్తుందని హరిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ షకీనా అన్నారు. తిమ్మరాజుపేట అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతున్న తల్లిపాల వారోత్సవాలలో ఆమె మాట్లాడారు. పుట్టిన శిశువుకు తల్లిపాలను ఇవ్వడం ద్వారా ఆ బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరగడమే కాకుండా, సులువుగా జీర్ణమై మెదడు శక్తివంతంగా పనిచేస్తుందన్నారు. సర్పంచ్ భాగ్యలక్ష్మి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మారిశెట్టి వెంకట అప్పారావు, ఏసీడీపీవో ఇందిరాదేవి, సూపర్‌వైజర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి : తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని అంగన్‌వాడీ సూపర్ వైజర్లు ఎస్‌వీఎస్ రాణి, డి.పద్మావతిఅన్నారు. దిమిలి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల వారోత్సవాల్లో భాగంగా ఆమె మాట్లాడారు. సకల పోషకాలు మిళితమైన తల్లిపాలు పిల్లలకు ఇస్తే ఎంతో ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. కొంతమంది తల్లులు ఉద్యోగాలు, ఇతర కారణాల రీత్యా చంటి పిల్లలకు పాలు ఇవ్వడం మానేసి డబ్బాపాలను ఇస్తున్నారన్నారు. ఇటువంటి పాలు ఆరోగ్యపరంగా బిడ్డకు మంచిది కాదన్నారు. దిమిలి పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి ఎస్ఎస్‌వీ రాజు, ఏఎన్ఎం, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


దిమిలి అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రాణి

పులపర్తి జడ్పీ పాఠశాలను సందర్శించిన ఆర్‌జేడీ

ఎలమంచిలి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పులపర్తిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయ్ భాస్కర్ శనివారం సందర్శించారు. తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను తీర్చిదిద్దాలన్నారు. ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం వల్ల విద్యార్థులకు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తవన్నారు. మధ్యాహ్నం భోజన పథకాన్ని పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని, ఈ ఏడాది మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి అప్పారావు, ఎంఈవో అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చాకిరేవు ఆక్రమణపై తహశీల్దార్‌కు ఫిర్యాదు

అచ్యుతాపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నునపర్తిలో చాకిరేవు ప్రాంతాన్ని పలువురు ఆక్రమించి శుక్రవారం రాత్రి ట్రాక్టర్ల ద్వారా చదును చేయించారని గ్రామానికి చెందిన నల్లమారెమ్మ రజక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దుప్పాడ మునిలినాయుడు, తోకాడ రాజు ఆరోపించారు. ఈ మేరకు శనివారం తహశీల్దార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. నునపర్తి సర్వే నంబర్ ఒకటిలో ఉన్న గెడ్డలో తమ తాత ముత్తాతల నుంచి చాకిరేవు పనులు చేస్తున్నామన్నారు. గతంలో పలువురు ఆక్రమించేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నామన్నారు. దీనిపై ఆర్డీవో విచారణ జరిపి ఈ భూమి ప్రభుత్వానిదని తేల్చారన్నారు. అయినప్పటికీ కొందరు పెద్దలు సదరు ప్రాంతాన్ని ఆక్రమించి రాత్రికి రాత్రే చదును చేయించారన్నారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

పలు గ్రామాలకు రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎలమంచిలి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి డివిజన్‌లో ఆర్‌డీఎస్ఎస్ పనుల కారణంగా ఈ నెల నాలుగో తేదీ సోమవారం నాలుగు మండలాల పరిధిలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్ తెలిపారు. పాయకరావుపేట మండలం కుమారపురం, రాజగోపాలపురం, కందియుడి, పీఆర్‌బీ పురం, సీహెచ్.నరసాపురం, పాల్తేరు, అంకంపేట, గోపాలపట్నం, పెదరాజుపాలెం, పెంటకోట, రాజీవ్‌పేట, అలాగే నక్కపల్లి మండలం దేవవరం, ఒట్టుమెట్ట, గుంటపల్లి, నామవరం, అదేవిధంగా ఎలమంచిలి మండలంలో ఎలమంచిలి పట్టణం (వ్యవసాయ విద్యుత్), కొత్త ఎర్రవరం, సోమలింగపాలెం, కట్టుపాలెం, రామారాయుడుపాలెం, కొత్తపాలెం(ఏజీఎల్), ఎస్.రాయవరం మండలం పెట్టుగోళ్లపల్లి, రామయ్యపట్నం, నీలాద్రిపురం, పెదబోదిగల్లం, రామకృష్ణాపురం, సీతమ్మపాలెం, ఉప్పరాపల్లి, వెంకటాపురం, లింగరాజుపాలెం, జేవీపాలెం, సర్వసిద్ధి, కర్రివానిపాలెం, బసవపాడు, సైతారుపేట, వాకపాడు, కొండకర్ల సబ్‌స్టేషన్ పరిధిలోని హరిపాలెం, అందాలపల్లి, తిమ్మరాజుపేట, పెదపాడు, ఖాజీపాలెం, జగన్నపేట ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం కలగనుందని వివరించారు.

రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

▸▸ టీడీపీ జిల్లాశాఖ అధ్యక్షుడు తాతయ్యబాబు

నక్కపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఏడాది పాలనలో అమలుచేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కిందని టీడీపీ జిల్లా శాఖ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు అన్నారు. మండలంలోరి డొంకాడ గ్రామంలో శనివారం నియోజకవర్గ స్థాయి అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తాతయ్యబాబు మాట్లాడుతూ అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ ఆర్థిక సాయం అందజేస్తోందని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకుని పంటల సాగులో మెరుగైన దిగుబడులు సాధించి, ఆర్థికాభివృద్ధి చెందాలని సూచించారు. నియోజకవర్గం పరిధిలో 39, 323 మంది లబ్ధిదారులకు గాను రూ 26.19 కోట్ల నిధులు రైతుల ఖాతాలో జమ కానునున్నట్టు చెప్పారు. ఎంఎం కిసాన్, రాష్ట్ర ప్రభుత్వ అన్నదాత సుఖీభవ ప్రోత్సాహకాలపై ఏవో ఉమా ప్రసాద్ వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చందిన కొండలరావు, నియోజకవర్గం కూటమి నాయకులు తోట నగేశ్, కొప్పిశెట్టి వెంకటేశ్, లాలం కాశీనాయుడు, లింగంనాయుడు, కురందాసు నూకరాజు, వెలగా శ్రీను, కొప్పిశెట్టి బుజ్జి, గింజాల లక్ష్మణరావు, వైబోయిన రమణ, నానాజీ, రమేశ్, ఏవఎఓలు సౌజన్య, ఆదినారాయణ, సరోజినీ తదితరులు పాల్గొన్నారు.


అన్నదాత సుఖీభవ చెక్కును విడుదల చేస్తున్న తాతయ్యబాబు, అధికారులు

ఐఐఎస్ఈఆర్ ప్రవేశ పరీక్షలో శ్యామ్‌కు 270 ర్యాంకు


ఆలిండియా ర్యాంకు సాధించిన శ్యామ్

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవరం గ్రామానికి చెం దిన తమిర్సి శ్యామ్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్) ప్రవేశ పరీక్షలో సత్తా చాటాడు. మేలో నిర్వహించిన ఈ పరీక్ష ఫలితాల్లో ఆల్ ఇండియా 270 ర్యాంకు సాధించి ఆర్థిక శాస్త్రంలో ప్రవేశం పొందా డు. శ్యామ్ తండ్రి గంగారావు రైతు, తల్లి ఆదివరలక్ష్మి గృహిణి. శ్యామ్ విశాఖలో చైతన్య విద్యాసంస్థలలో బైపీసీ పూర్తి చేశాడు. ఐఐఎస్ఈఆర్‌లు పరిశోధన పరంగా ఐఐటీలతో సమానమైన జాతీయస్థాయి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు. బ ర్హంపూర్, భోపాల్, కోల్‌కతా, మొహాలీ, పూణే, తిరువనంతపురం, తిరుపతిలలో ఏడు సంస్థలు ఉన్నాయి. ఐఐటీలు ఇంజనీరింగ్‌పై, ఐఐ ఎస్ఈఆర్‌లు ఆర్థిక శాస్త్ర రంగంలో పరిశోధనపై దృష్టి పెడతాయి. శ్యామ్ ఈ ఏడాది ఏపీ ఈఏపీసెట్‌లో 560వ ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైపీసీ వి ద్యార్థులు ఎంబీబీఎస్ మాత్రమే కాకుండా పరిశోధన రంగంలో ఆసక్తి ఉంటే ఐఐఎస్ఈఆర్‌లో జాయిన్ కావాలన్న ఉపాధ్యాయులు గైడెన్స్‌పై ఈ ప్రవేశ పరీక్ష రాశానన్నారు. శ్యామ్‌ను తల్లిదండ్రులు, తదితరులు అభినందించారు.

కానిస్టేబుల్‌గా ఎంపికైన మత్స్యకార యువకుడు


ముత్తు వెంకటేశ్

పాయకరావుపేట ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజవరానికి చెందిన మత్స్యకార యువకుడు ముత్తు వెంకటేశ్ పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. గ్రామానికి చెందిన ముత్తు జగదీష్, లక్ష్మి దంపతుల కుమారుడు వెంకటేశ్ బీఎస్సీ చదివాడు. ఎన్‌సీసీలోనూ బీ, సీ సర్టిఫికెట్లు సాధించాడు. ప్రభుత్వం కానిస్టేబుల్స్ నియామకాలకు నిర్వహించిన రాత పరీక్షలో 129 మార్కులతో ఏపీఎస్‌టీకి ఎంపికైనట్టు వెంకటేశ్ తెలిపాడు

ఆహార మార్పులతో రుతు సంబంధిత సమస్యలకు చెక్


మోడల్ ప్రెజెంటేషన్స్‌లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పాయకరావుపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మహిళలకు నెలసరి సమయంలో వచ్చే సమస్యలను ఆహారంలో తగిన మార్పులు తీసుకోవడం ద్వారా అరికట్టవచ్చని ప్రముఖ ప్రసూతి, స్త్రీ వైద్యురాలు కె. మాధవీలత తెలిపారు. శనివారం పాయకరావుపేట శ్రీప్రకాష్ అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల, క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. నూనె పదార్థాలు, స్వీట్లు, కారం తదితర వాటితో సమస్యలు వస్తాయన్నారు. అనంతరం ప్రముఖ మిల్లెట్ పాకశాస్త్ర నిపుణుడు రాంబాబు ఆరోగ్యాన్ని పరిరక్షించే ఆహారం ఎలా తయారుచేసుకోవాలో వండి చూపారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన పేపర్, మోడల్ ప్రెజెంటేషన్‌లో విజేత లకు బహుమతులందజేశారు. విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్. విజయ్ ప్రకాష్‌రాష్ట్ర జీవ వైవిధ్య మండలి కో- ఆర్డినేటర్ ముత్తా వెంకటరమణ, కళాశాల కమిటీ చైర్మన్, క్షత్రియ సేవా సమితి కార్యదర్శి దం తులూరి వెంకటరాజు,సభ్యులు ఎస్ఆర్‌వీవీ. శ్రీనివాసరాజు, పృథ్వీరాజు, వి.రాజబాబు, జూనియర్, డిగ్రీకళాశాలల ప్రిన్సిపాల్స్ డి.విజయలక్ష్మి, ఎ.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

టైలరింగ్‌తో స్వయం ఉపాధి: ఎంపీడీవో

నక్కపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): టైలరింగ్ వృత్తి ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చునని స్థానిక ఎంపీడీవో సీతారామరాజు చెప్పారు. మండలంలోని వేంపాడు గ్రామంలో వున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ, శిక్షణ కాలంలో టైలరింగ్‌లో మెలకువలు తెలుసుకోవాలని సూచించారు. అనంతరం వేంపాడు గ్రామంలో సంపద కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. సేంద్రియ ఎరువుల ఉత్పత్తులను పెంచాలని ఆదేశించారు. ఆయనవెంట సెక్రటరీ ఎం.శ్రీనివాస్ తదితరులున్నారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై చర్యలు

▸▸ 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్


పెదగుమ్ములూరు మేడికొండను పరిశీలిస్తున్న తహశీల్దార్

ఎస్. రాయవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎక్కడైనా గ్రావెల్ అక్రమ తవ్వకాలు చేపట్టినట్టయితే చట్టపరమైన చర్యలు తప్పవని తహశీల్దార్ రమేశ్‌బాబు హెచ్చరించారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో 'గ్రావెల్ దందాను అరికట్టడంలో అధికారులు విఫలం' శీర్షికన వచ్చిన కథనానికి తహశీల్దార్ స్పందించారు. పెదగుమ్ములూరు మేడికొండ వద్ద జ రిపిన గ్రావెల్ అక్రమ తవ్వకాల ప్రదేశాన్ని స్థానిక వీఆర్‌వో నూకరాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి మేడికొండ వద్ద అర్ధరాత్రి సమయాల్లో గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నట్టు స్థానికుల ద్వారా తెలుసుకున్నామన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆయన చెప్పారు.

'రక్షణ ట్రస్టు పేరిట అక్రమాలపై ఫిర్యాదు'

ఎస్. రాయవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో రక్షణ చారిటబుల్ ట్రస్టు పేరుతో అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ శనివారం జిల్లా ఎస్పీకు ఫిర్యాదు చేసినట్టు సామాజిక కార్యకర్త సోమిరెడ్డి నూకరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది ముఠాగా మారి రాష్ట్రయానిమల్ వెల్ఫేర్ బోర్డు ద్వారా సర్టిఫికెట్ పొంది రక్షణ చారిటబుల్ ట్రస్టు పేరుతో పెనుగొల్లులో గోశాలను ఏ ర్పాటు చేశారన్నారు. గోవుల రక్షణ పేరిట అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. జాతీయ రహదారిపై అక్రమంగా ఆవులను తరలిస్తున్న వాహనాలను ఆపి పెద్ద మొత్తంలో సొమ్ము కాజేస్తున్నట్టు ఆయన ఆరోపించారు. ఈ ముఠాపై చర్యలు తీసుకోవాలని కోరానన్నారు.

డీ పట్టా భూముల ఆన్‌లైన్ కోసం ధర్నా


తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

ఎస్. రాయవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగుమ్ములూరు పంచాయతీ పరిధి నీలాంద్రిపురం, సీతారామపురం గ్రామాలకు చెందిన డీ-పట్టా సాగుదారులు తమ భూ ములను ఆన్‌లైన్ చేయాలంటూ సీపీఎం మండల కార్యదర్శి ఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ 2003, 2005లో నీలాద్రిపురం, సీతారామపురం గ్రామాలకు చెందిన పలువురు నిరుపేదలకు ఇచ్చిన పట్టా భూములను ఆన్‌లైన్ చేయకపోవడంతో సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారన్నారు. అనంతరం డీటీ నీరజకు వినతిపత్రాన్ని అందజేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


బస్సు కిందకు వెళ్లిన బైక్

పాయకరావుపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్‌రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో ద్విచక్ర వాహనదారుడికి తృటిలో ప్రమాదం తప్పింది. శనివారం స్థానిక కంటోన్మెంట్ ఏరియా ఎదుట మెయిన్‌రోడ్డుపై వెళుతున్న హెటిరో బస్సు, ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో దిచక్ర వాహ నం బస్సు ముందు చక్రం సమీపిస్తుందనగా బైక్ నడుపుతున్న వ్యక్తి అప్రమత్తమై పక్కకు తప్పుకున్నారు. అయితే, ద్వి చక్ర వాహనదారుడు హెటిరో బస్సు డ్రైవర్‌తో వాగ్వావాదానికి దిగడంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కి అంతరాయం ఏర్పడింది. చివరకు పోలీసులు వచ్చి ఇద్దరికీ నచ్చచెప్పడంతోపాటు ట్రాఫిక్ సరిచేశారు.

తల్లి పాలే బిడ్డకు సరైన పోషకాహారం

పాయకరావుపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో రెండో రోజు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్.వాడ, వీవర్స్‌కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సెక్టార్ సూపర్‌వైజర్ కె.లలిత మాట్లాడుతూ బాలింతలు, గర్భిణీలకు తల్లిపాల ప్రాముఖ్యత, వ్యక్తిగ శుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా మండలంలోని కందిపూడి సెక్టార్ పరిధి గ్రామాల్లో కూడా శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కె.నూకరత్నం, కుమారి, ఎం.నూకరత్నం, దేవి, రాణి, కుమారి తదితరులతోపాటు అధిక సంఖ్యలో గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.


ఎస్. రాయవరం: తల్లి పాలే పుట్టిన బిడ్డకు సరైన పోషకాహారమని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సమావేశంలో ఎంపీడీవో , ఐసీడీఎస్ సీడీపీవో శ్రీవిద్య, బాలల పరిరక్షణ జిల్లా ప్రతినిధి డి. లోవరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా అవ గాహన ర్యాలీ నిర్వహించారు. అంగనవాడీ సూపర్‌వైజర్‌లు కనకదుర్గ, మునీష, అంగనవాడీలు పాల్గొన్నారు.

విద్యుత్ రాయితీ పెంపుపై చేనేత కార్మికుల హర్షం


ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్న చేనేత కార్మికులు

పాయకరావుపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు ఇప్పటి వరకు ఇస్తున్న 100 యూనిట్ల విద్యుత్ సబ్సిడీని 200 యూనిట్లకు ప్రభుత్వం పెంచుతున్నట్టు ప్రకటించడంపై పలువురు చేనేత కార్మికులు హర్షం వ్యక్తంచేశారు. శనివారం స్థానిక చేనేత సొసైటీలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వార్డు సభ్యుడు మలిపెద్ది వెంకటరమణ మాట్లాడుతూ, పాయకరావుపేటలో చేనేత కార్మికులకు పని కల్పించే సొసైటీని ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఆప్కోని బలోపేతం చేసి మార్కెటింగ్ సదు పాయం కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మేనేజరు గోరు నాగేశ్వరరావు, కాలెపు వీరభద్రరావు, కర్ర శ్రీను, రొబ్బి సుబ్రహ్మణ్యం, గోరు భద్రం, యర్ర వీర్రాజు తదితరులు పాల్గొన్నారు

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక


కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న దృశ్యం

ఎస్. రాయవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఏపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గ ఎన్నికను నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా కర్రి దర్మారావు, ప్రధాన సలహాదారుడిగా బి సింహాచలం, మండల అధ్యక్షునిగా జి. సునీల్, ప్రధాన కార్యదర్శిగా కె. శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పి నానాజీ, కె రామకృష్ణ, కె రవి, కె ఉమాదేవి, కార్యదర్శులుగా బీటీ విద్యాధర్, డి రమేశ్, వి గంగరాజు, ఎండీ సాధిక్, పి శ్యామలాదేవి జిల్లా కౌన్సిలర్‌లుగా ఈ గోవిందరావు, వై శ్రీనివాసరావు, ఎం రామ్మూర్తి, పి కామరాజు, ఎస్ సత్యనారాయణ తదితరులు ఎంపికయ్యారు. ఎన్నికల అధికారిగా డి కొండలరావు, పరిశీలకుడిగా పి గణేశ్ వ్యవహరించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఎస్. రాయవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయముటుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. పెట్టుగోళ్లపల్లి, రా మయ్యపట్నం, నీలాద్రిపురం, ఉప్పరాపల్లి, వెంకటాపురం, లింగరాజుపాలెం, జేవీపాలెం, సర్వసిద్ధి, కర్రివానిపాలెం, బసవపాడు, సైతారుపేట, వాకపాడుతోపాటు నక్కపల్లి మండలం పెదబోదిగల్లం, రామకృష్ణపురం, పెదదొడ్డుగల్లు, సీతమ్మపాలెంలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంకితభావంతో పనిచేస్తేనే

న్యాయవాది వృత్తిలో గుర్తింపు

▸▸ ఏపీ హైకోర్టు న్యాయమూర్తి చీమలపాటి రవి



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవిని సత్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు

సబ్బవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అంకితభావంతో పనిచేస్తేనే న్యాయవాది వృత్తిలో రాణించగలరని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి అన్నారు. స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ఐదు సంవత్సరాలు, మూడు సంవత్సరాల కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినయం, విధేయత, క్రమశిక్షణ ఉన్నప్పుడే న్యాయ విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోగలరన్నారు. మంచి పౌరుడు అయినప్పుడే మంచి న్యాయవాది కాగలడన్నారు. అంకితభావంతో వృత్తిని స్వీకరించినప్పుడే న్యాయవాది వృత్తిలో రాణించగలరన్నారు. తరాలుగా న్యాయవాది వృత్తిలో రాణిస్తున్న వారంతా క్రమశిక్షణతో మెలిగినవారేనని చెప్పారు. వృత్తిలో నిర్లక్ష్యం వహిస్తే మనం, మన ముందు పుస్తకాలే మిగులుతాయన్నారు. అనంతరం వర్సిటీలో సౌకర్యాలు, ఆహారంలో నాణ్యత, తరగతులు జరుగుతున్న తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాన్ని సందర్శించి అక్కడ సౌకర్యాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకు ముందు వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు అధ్యక్షోపన్యాసం చేస్తూ సమాజాన్ని అర్థం చేసుకున్నప్పుడే 'లా' అర్థమవుతుందన్నారు. సమాజాన్ని అర్థం చేసుకోకుండా చట్టాన్ని చదివినా అర్థం కాదన్నారు. సమాజాన్ని స్టడీ చేసి, చట్టంలో వచ్చిన మార్పులను అధ్యయనం చేసినట్టయితే న్యాయవాది వృత్తిలో విశేషంగా రాణించవచ్చునని తెలిపారు. అనంతరం జస్టిస్ చీమలపాటి రవికి జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు నరసింగరావు, రామజోగేశ్వరరావు, వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భువనేశ్వరీదేవిని దర్శించుకున్న చినరాజప్ప



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే చినరాజప్ప, మాజీ ఎమ్మెల్సీ బుద్ద

సబ్బవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆరిపాక సమీపం మణిపురం బొడ్లబావి వద్ద కొలువుదీరి ఉన్న భువనేశ్వరీదేవిని శనివారం మాజీ హోం మంత్రి, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు జరిపారు. ముందుగా ఆలయానికి వచ్చిన వీరికి కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు. దర్శనాల అనంతరం అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బుద్ద భువనేశ్వరరావు, దాడి వేణు తదితరులు పాల్గొన్నారు.

'కూటమి అధికారంలోకి వచ్చాకే సంక్షేమ పాలన'



సంక్షేమ పథకాలపై కరపత్రాలను అందజేస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

లంకెలపాలెం ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : కూటమి అధికారంలోకి వచ్చాకే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతోందని జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. దేశపాత్రునిపాలెం, పరిసర ప్రాంతాల్లో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు కరణం అప్పారావు, జోగినాయుడు, మచ్చా శివకుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'వాహన మిత్ర'లో రూ.15 వేల అమలుకు ధర్నా

అనకాపల్లి టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర పథకం ద్వారా రూ. 15వేలు అమలు చేయాలని ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల గోవింద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇక్కడి ఆర్టీవో కార్యాలయం ఎదుట పలువురు ఆటో డ్రైవర్లతో కలిసి శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా వాహనమిత్ర పథకం అమలు చేయాలన్నారు. పథకం అమలుకు పెట్టిన షరతులను తొలగించాలని కోరారు. డీజిల్, పెట్రోల్ ధరలు ఇప్పటికే పెరిగిపోవడంతో మోటార్ వాహన కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కోరిబిల్లి జగదీష్, ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ, ఏఐటీయూసీ నాయకులు వాయిబోయిన శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ స్థలంలో నిర్మాణాలపై నోటీసులు

కశింకోట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలంలో నిర్మాణాలు చేపట్టిన వారికి ఎంపీడీవో కార్యాలయ అధికారి తమ్మిన తోటారావు, పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి రామ్మూర్తి నాయుడు శనివారం నోటీసులు అందజేశారు. పంచాయతీ స్థలం ఆక్రమణకు గురైందన్న ఫిర్యాదు మేరకు సదరు ప్రాంతాన్ని పరిశీలించారు. నిర్మాణాలు చేపట్టిన వారి వద్ద ఉన్న అనుమతి పత్రాలను 24గంటల్లో సమర్పించాలని సూచించారు. లేనిపక్షంలో చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికల బరిలో 20 మంది


▸▸ కూటమి నుంచి పది మంది, వైసీపీ నుంచి పది మంది...

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల బరిలో 20 మంది నిలిచారు. కమిటీలో పది మంది సభ్యులను ఎన్నుకునేందుకు గత నెల 21న కమిషనర్ కేతన్‌గార్గ్ నోటిఫికేషన్ జారీచేయగా, 21 మంది నామినేషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. వారిలో కూటమి నుంచి 11 మంది, వైసీపీ నుంచి పది మంది ఉన్నారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీకి జనసేన దూరంగా ఉంటున్నట్టు ప్రకటించినప్పటికీ ఆ పార్టీకి మద్దతు ప్రకటించిన ఇండిపెండెంట్ కార్పొరేటర్ (39వ వార్డు) మహ్మద్ సాదిక్ నామినేషన్ దాఖలు చేయడం కూటమి అభ్యర్థుల్లో కలకలం రేపింది. చివరకు జనసేన పార్టీ నేతల ఆదేశాలు మేరకు మహ్మద్‌సాదిక్ శనివారం అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ ఛాంబర్‌కు వెళ్లి తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో కూటమి నుంచి పది మంది, వైసీపీ నుంచి పది మంది మాత్రమే పోటీలో నిలిచినట్టయ్యింది. జీవీఎంసీ కౌన్సిల్‌లో కూటమికి 63 మంది, వైసీపీకి 34 కార్పొరేటర్ల బలం ఉంది. దీంతో కూటమి అభ్యర్థుల గెలుపు లాంఛనమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల ఆరో తేదీన ఎన్నిక జరగనున్నది.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

▸▸ అనకాపల్లి, సబ్బవరంలలో జరిగిన అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేశ్‌బాబు, కలెక్టర్ విజయకృష్ణన్





అనకాపల్లిలో పథకం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల, చిత్రంలో కలెక్టర్ విజయకృష్ణన్.., సబ్బవరంలో నమూనా చెక్కు అందిస్తున్న పంచకర్ల

అనకాపల్లి టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్టు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. పట్టణంలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో శనివారం అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకాన్ని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించే పంటలకు పెట్టుబడి సాయానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్టు చెప్పారు. జిల్లాలో సాగు భూమి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి, అటవీ భూమి సాగుదారు కుటుంబాలకు అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు, పీఎం కిసాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.ఆరువేలు కలిపి సంవత్సరానికి రూ.20వేలు చొప్పున అధిక సహాయం అందిస్తున్నాయన్నారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా యాభైశాతం రాయితీపై రైతులకు పనిముట్లు అందజేసినట్టు చెప్పారు. అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ కింద అనకాపల్లి నియోజకవర్గంలో 22,314 మంది లబ్ధిదారులకు రూ.14.83 కోట్లు, అలాగే హార్టీకల్చర్ సాగుకు పాత పెండింగ్‌లో ఉన్న బకాయిలు రూ. 5.5 కోట్లు విడుదలయ్యాయన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. అంతకుముందు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వర్చువల్ ప్రసంగాలను వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో షేక్ ఆయిషా, జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే, అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, పోల్నాటి అప్పారావు, వ్యవసాయశాఖ సిబ్బంది, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైతు బాగుంటేనే రాష్ట్రం సుభిక్షం : పంచకర్ల

సబ్బవరం : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం ప్రారంభోత్సవంలో మాట్లాడారు. రైతు బాగుంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఈ పథకం కింద పెందుర్తి, సబ్బవరం, పరవాడ మండలాలకు చెందిన 18,590 మంది రైతులకు మొదటి విడతగా రాష్ట్రం రూ.ఐదు వేలు, కేంద్రం రూ. రెండు వేలు మొత్తం రూ.ఏడు వేలు చొప్పున రూ.13.72 కోట్లు వారి ఖాతాల్లో జమైనట్టు వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో సర్వనాశనం చేసినా కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతుందన్నారు. అనంతరం ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. మండల వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ప్రత్యేకాధికారిణి కె.రమాదేవి, ఎంపీ డీవో శివరాంప్రసాద్, తహసీల్దార్ చిన్నికృష్ణ, పెందుర్తి, పరవాడ ఏవోలు చంద్రావతి, రమాదేవి, వైస్ ఎంపీపీ యూస్సీలక్ష్మీరాణి, నాయకులు ఇందలి రమణ, కర్రి కనకరాజు, బి. దేముడుబాబు, చైతన్య, రోమాల చంద్రశేఖర్, సీరం అప్పలరాజు, కోరాడ శ్రీను, పద్మ, బోకం స్వామి నాయుడు, శింగంపల్లి శ్రీను, కేవీ సత్యనారాయణ, శేఖర్, జెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానంపై అవగాహన పెంచుకోండి

▸▸ విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించాలి ▸▸ ప్రతి ప్రధానోపాధ్యాయుడు తప్పనిసరిగా ఒక సబ్జెక్టును పూర్తిగా బోధించాలి

▸▸ ఉన్నత పాఠశాలలు , కేజీబీవీ, మోడల్ స్కూళ్ల సిబ్బంది సదస్సులో ప్రాంతీయ విద్యా సంచాలకుడు విజయభాస్కర్



హెచ్ఎంలు, స్పెషల్ ఆఫీసర్లు, ప్రిన్సిపాళ్లను ఉద్దేశించి మాట్లాడుతున్న విజయభాస్కర్

కశింకోట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : నూతన విద్యాబోధన, మూల్యాంకన విధానాలపై అవగాహన పెంచుకోవాలని విశాఖ ఒకటో జోన్ ప్రాంతీయ విద్యా సంచాలకుడు కె.విజయభాస్కర్ సూచించారు. శనివారం ఇక్కడి సెయింట్ జాన్స్ స్కూల్‌లో ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ విద్యా సంస్థల స్పెషల్ ఆఫీసర్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లకు ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. విద్యాశాఖలో అమల్లోకి వచ్చిన నూతన విద్యా విధానాలు, బోధన, మూల్యాంకన విధానాలపై సంబంధిత బాధ్యులంతా ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలన్నారు. ముఖ్యంగా ఈ విద్యా సంవత్సరం నుంచి అమలులోకి వచ్చిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తే పనితీరు మెరుగుపరచుకునే అవకాశం ఉంటుందని వివరించారు. నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మదింపు విధానాలతో వచ్చిన అసెస్మెంట్ పుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా ఒక సబ్జెక్టును పూర్తిగా బోధించాలన్నారు. ప్రతి విద్యార్థిని వ్యక్తిగతంగా వారి విద్యాస్థాయిలను పరిశీలించాలని సూచించారు. విద్యార్థుల హాజరు, విద్యా ప్రగతిని ఎప్పటికప్పుడు పరిశీలించి నమోదు చేయాలన్నారు. ముఖ్యంగా డ్రాపవుట్స్ లేకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన ఆహారాన్ని అందజేయాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో జిల్లా ఉప విద్యాశాఖాధికారి పొన్నాడ అప్పారావు, పరీక్షల విభాగం సహాయ సంచాలకులు శ్రీధర్‌రెడ్డి, జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి సిహెచ్.సత్యనారాయణ, సీసీ వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజల్లో చైతన్యం నింపుతున్న బళ్లారి రాఘవ రచనలు

▸▸ జయంత్యుత్సవంలో ఏఎస్పీలు దేవప్రసాద్, మోహనరావు



బళ్లారి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది

అనకాపల్లి రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ నాటక రచయిత, నటుడు బళ్లారి రాఘవ 145వ జయంతిని ఇక్కడి జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఏఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బళ్లారి రాఘవ తెలుగు నాటకరంగానికే కాకుండా సమాజం మార్పు వైపు దారితీసే శక్తిగా కళను ఉపయోగించిన మహోన్నతుడుగా పేర్కొన్నారు. అందుకే ఆయన రచనలు నేటికీ ప్రజల్లో చైతన్యం నింపుతున్నాయని కొనియాడారు. నాటకాల రూపంలో సామాజిక సమస్యలను సమర్థంగా ప్రదర్శించి స్పష్టమైన సందేశాలను ఇచ్చిన ఘనత బళ్లారిదేనన్నారు. డీటీసీ డీఎస్పీ మోహనరావు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో అధికారులు, గ్రామస్థులు

వలసల నివారణకే ఉపాధి హామీ పథకం

▸▸ కూండ్రంలో జరిగిన అవగాహన సదస్సులో అధికారులు

కొత్తూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కూండ్రంలో ఉపాధి హామీ పథకంపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సామాజిక తనిఖీ డైరెక్టర్ జి.శ్రీకాంత్ పర్యవేక్షణలో పథకం గురించి గ్రామసులకు వివరించారు. వలసల నివారణకు ప్రభుత్వం గ్రామీణ ప్రజల కోసం ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్టు చెప్పారు. దీనిని అర్హులంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. అనంతరం గ్రామ పురవీధుల్లో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఏఎంసీ చైర్మన్ పచ్చికూర రాము, గ్రామ సర్పంచ్ నందారపు లక్ష్మి, టీడీపీ సీనియర్ నాయకుడు నందారపు సూరిబాబు, కార్యదర్శి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పదంగా ఎన్టీఆర్ స్టేడియంలో వినాయక విగ్రహ ఏర్పాట్లు



స్టేడియంలో 65 అడుగుల వినాయక విగ్రహం ఏర్పాటుకు సరుగుడు కర్రలతో సన్నాహాలు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో వినాయక విగ్రహ ఏర్పాట్లు వివాదాస్పదమైంది. దీంతో జీవీఎంసీ జోనల్ అధికారులు శనివారం సాయంత్రం ఏర్పాట్లను తొలగించేందుకు సిద్ధమయ్యారు. నిర్వాహకులు విశాఖనగరంలో మాదిరిగా అనకాపల్లిలో 65 అడుగుల ఎత్తులో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించి, జీవీఎంసీ కమిషనర్ నుంచి అనుమతులు పొందారు. అయితే ఈ అనుమతులు ఈనెల 27 నుంచి ఉన్నట్లు జీవీఎంసీ వర్గాలు చెబుతున్నాయి. 65 అడుగుల విగ్రహం ఏర్పాటుకు సమయం సరిపోదన్న ఉద్దేశంతో నిర్వాహకులు గతవారం రోజుల నుంచి విగ్రహం ఏర్పాటుకు అవసరమయ్యే సరుగుడు రాట్లతో పనులు ప్రారంభించారు. జిల్లా ఏర్పడిన తర్వాత ప్రతి ఆగస్టు 15న ఎన్టీఆర్ స్టేడియంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ వేడుకల్లో ప్రభుత్వ శకటాలు తిరగడానికి ఆటంకంగా ఈ ఏర్పాట్లు ఉన్నట్లు అధికారులు భావించారు. కలెక్టర్ విజయకృష్ణన్ నిర్వహించిన సమావేశంలో కూడా తక్షణమే నిర్మాణ పనులు ఆపించి తొలగించాలని జీవీఎంసీ అధికారులకు ఆదేశించినట్టు తెలిసింది. ఇందులో భాగంగా జీవీఎంసీ టీపీవో కనకారావు, సిబ్బంది, పోలీసులు శనివారం స్టేడియానికి చేరుకున్నారు. నిర్వాహకులతో మాట్లాడారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ శకటాలు తిరగడానికి ఎటువంటి ఆటంకం లేకుండా ఉండేలా నిర్మాణం చేసిన ఏర్పాట్లలోని కొంత భాగాన్ని తొలగించాలని సూచించారు. ఇందుకు నిర్వాహకులు కూడా అంగీకరించారు. అయితే చీకటిపడినా పరిస్థితి వివాదస్పదంగానే ఉంది.

నేడు సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



అనకాపల్లి టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి దాసరిగెడ్డ రోడ్డులోని సత్తెమ్మతల్లి ఆలయ 34వ వార్షికోత్సవ ఆదివారం జరగనుంది. ఇందుకు సంబంధించి ఆలయ కమిటీ కన్వీనర్ బొడ్డేడ మోహనరావు ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేపట్టారు. వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభం కానున్నాయి. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నసమారాధన జరపనున్నారు.

'ఏఎంఏఎల్'లో పింగళి వెంకయ్య జయంతి



పింగళి వెంకయ్య చిత్రపటం వద్ద సిబ్బంది నివాళి

కొత్తూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఏఎంఏఎల్ కళాశాలలో పింగళి వెంకయ్య జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకం రూపకల్ప అయిన వెంకయ్య జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ నిరంజన్, వివిధ విభాగాల అధిపతులు, సూపరింటెండెంట్ పి.అనురాధ, ఎన్ఎస్ఎస్ అధికారులు బీఎంవీపీ నాయుడు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం విఫలం'

అనకాపల్లి టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వైసీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ నాయకులతో కలిసి శనివారం సాయంత్రం 82వ వార్డు పాత బర్మాకాలనీలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ అనే నినాదంతో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, నాయకులు జానకిరామరాజు, వేగి త్రినాథ్, కేఎం నాయుడు, దంతులూరి దిలీప్‌కుమార్, జాజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్న ఎక్స్‌కవేటర్ సీజ్

సబ్బవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 88వ వార్డు పరిధి వెదుళ్లనరవలోని పిలకమెట్టపై అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్న ఎక్స్‌కవేటర్‌ను రీజినల్ విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. దీనికి సంబంధించి ఆర్ఐ వీరయ్య తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. వెదుళ్లనరవ సర్వే నంబరు 101లో గల పిలక మెట్టపై కె.అప్పలరాజుకు చెందిన ఎక్స్‌కవేటర్‌తో కొన్నిరోజులుగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. దీనిపై గత నెల 21న 'ప్రభుత్వ భూములకు రక్షణ కరువు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం వెలువడింది. దీంతో విజిలెన్స్ అధికారులు పిలకమెట్ట తవ్వకాలపై నిఘా పెట్టారు. గత నెల 28వ తేదీ సాయంత్రం యథావిధిగా గ్రావెల్, రాళ్ల తవ్వుతుండగా రీజినల్ విజిలెన్స్ స్క్వాడ్ సిబ్బంది దాడి చేసి పట్టుకున్నారు. ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసి, యజమానిపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఎక్స్‌కవేటర్‌కు శనివారం రూ.98,500 జరిమానా విధించినట్టు ఆర్ఐ తెలిపారు.

'బల్క్ డ్రగ్ పార్కుతో భూసారానికి దెబ్బ'

అనకాపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లిలో ఏర్పాటు చేయనున్న బల్క్ డ్రగ్ పార్కుతో పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతుందని, ముఖ్యంగా భూసారం దెబ్బతినడమే కాకుండా జల వనరులకు పెను ముప్పు పొంచి వుందని రాజస్థాన్‌కు చెందిన జల్ బిరాదరి సంస్థ జాతీయ కన్వీనర్ బొలిశెట్టి సత్యనారాయణ ఆందోళన వ్యక్తం చేస్తోంది. బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు ప్రతిపాదనపై రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6న నక్కపల్లిలో ప్రజాభిప్రాయ సేకరణ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో బొలిశెట్టి సత్యనారాయణ నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుపై పలు సూచనలు చేస్తూ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు వల్ల ఆ ప్రాంతంలో భూసారం దెబ్బతినడమే కాకుండా నీటి వనరులు కలుషితం అవుతాయని, అంతే కాకుండా ప్రజారోగ్యం క్షీణిస్తుందని పేర్కొన్నారు. అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు చేపడుతున్న పర్యావరణ విధ్వంస కార్యక్రమాలకు స్వస్తి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేయనున్న నక్కపల్లి ప్రాంతంలో పారదర్శకతతో ప్రజాభిప్రాయ సేకరణ జరగాలని, స్వచ్ఛందంగా, శాస్త్రీయ పద్ధతిలో పర్యావరణ ప్రభావ అంచనాలు (ఈఐఏ) రూపొందించాలని పేర్కొన్నారు. తెలంగాణలో ఇప్పటికే బల్క్ డ్రగ్ పార్కు వల్ల నష్టపోయిన పటాన్‌చెరువు ప్రాంతంగా అనకాపల్లి జిల్లా నక్కపల్లిని మార్చవద్దని హెచ్చరిస్తూనే ప్రభుత్వం తక్షణమే స్పందించి గాలి, నీరు, నేల భవిష్యత్తు తరాల ఆరోగ్యాన్ని పరిరక్షించే విధంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు.

136 మంది కిడ్నీ బాధితులకు స్క్రీనింగ్ పరీక్షలు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం ఎదురుగా గల చిన్నపిల్లల అత్యవసర సేవల విభాగ కేంద్రంలో కిడ్నీబాధితులకు స్క్రీనింగ్ పరీక్షలు జరిగాయి. శనివారం జరిగిన ఈ పరీక్షల్లో 136 మంది కిడ్నీ బాధితులకు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. నెఫ్రాలజీ వైద్యులు రోగులకు పరీక్షలు చేశారు. మార్టూరు, మాకవరం, ఊడేరు, మామిడిపాలెం, సంపతిపురం, బవులవాడ, సీహెచ్ ఎన్ అగ్రహారం, వేటజంగాలపాలెం, కుంచంగి, రొంగలివానిపాలెం, సుందరయ్యపేట గ్రామాల్లో జరిగిన ఉచిత కిడ్నీ సంబంధిత పరీక్షలపై స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ స్పందించి మైనింగ్ జరుగుతున్న ప్రాంతాల్లో ప్రజలు కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతూ మరణించిన సందర్భాలుండడంతో ఈశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కొణతాలతో పాటు కలెక్టర్ విజయకృష్ణన్, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్, ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, వైద్యాలయం అభివృద్ధి కమిటీ సభ్యులు ఆళ్ల రామచంద్రరావు, తాడి శాంతికుమారి పాల్గొన్నారు.


అరకులోయలో మాట్లాడుతున్న గణబాబు, పక్కన దొన్నుదొర ఇతరులు


చింతపల్లి: మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎంవీవీ ప్రసాద్

అన్నదాతల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

- విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు
- అన్నదాత సుఖీభవ నిధులు జమ

అరకులోయ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించినట్టు విశాఖ పశ్చిమ నియోజవర్గ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పి. గణబాబు అన్నారు. శనివారం అరకులోయ టూరిజం గోష్టిలో టీడీపీ అరకు అ సెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ సియ్యారి దొన్నుదొర, పా డేరు సబ్‌కలెక్టర్ శౌర్యమన్ పటేల్‌తో కలిసి అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్లు అప్పులు చేసి ఆర్థికంగా రాష్ట్రాన్ని కుదేలు చేసిందన్నారు. అలాగే, మాజీ సీఎం జగన్‌రెడ్డి అ న్ని వ్యవస్థలను నాశనం చేశారన్నారు. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం ప్రజా, రైతు సం క్షేమానికి ప్రాధాన్యమిస్తోందన్నారు. అన్నదాత సుఖీభవ కింద అరకు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాలకుగాను 54975 మంది రైతులకు రూ. 34,09,03,000లు జమచేస్తున్నట్టు ప్రకటించారు. అరకులోయ మండలంలో 8933 మంది రైతులకు రూ.5,63,0,000, అనంతగిరిలో 8207 మంది రైతులకు గాను రూ. 5,03,50,000, డుంబ్రిగుడలోని 9605 మందికి రూ. 5,82,25,000, హుక్కుంపేటలో 11294 మంది రైతులకు గాను పెదబయలు మండలంలో 9469 మంది రెతులకుకు రూ.7,12,30,000, ముంచంగిపుట్టులో 7467 మందికి గాను రూ. 4,73,99,000 రైతుల ఖాతాలకు జమచేసినట్టు వివరించారు. గిరి రైతులు ఆర్థికంగా ఎదగాలన్నారు. గిరిజన రైతుల కోసం కాఫీ ప్రాజెక్టును ముఖ్యమంత్రి ప్రత్యేకంగా నెలకొల్పేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆర్టీసీ జోన్ చైర్మన్ దొన్నుదొర మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో 50 లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింప జేయడం ఆనందంగా ఉందన్నారు. అర్హులందరికీ అన్నధాత సుఖీభవ పథకం కు ఎంపిక చేసినట్టు సబ్‌కలెక్టర్ శౌర్యమన్‌పటేల్ వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, టీడీపీ మండల అధ్యక్షుడు కోయ్‌మహాదేవ్ ,పెదలబుడు సర్పంచ్ దాసుబాబు ఇతర నాయకులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు దే సూపర్ సిక్స్ హామీలు ఘనత

చింతపల్లి: ఎన్నికలు ముందకు ప్రజలకు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అమలుపరుస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎంవీవీ ప్రసాద్ అన్నారు. శనివారం వ్యవసాయ అధికారులు చిన్నగెడ్డ గ్రామ సచివాలయంలో అన్నదాత సుఖీభవ ప్రారంభ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులనుద్దేశించి ఆయన మాట్లాడారు. జగన్‌రెడ్డి గత ఐదేళ్లు ఇష్టారాజ్యంగా పాలన సాగించారన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధిని విస్మరించి ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నంచేశారన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచారన్నారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ అధికారి మధుసూదన రావు, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనంద్, ఏఎంసీ డైరెక్టర్ పెదిరెడ్ల బేతాళుడు, నాయకుడు అప్పారావు, రైతులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: రైతుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం పని చేస్తుందని టీడీపీ మండల అధ్యక్షురాలు కె.సన్యాసమ్మ అన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని శనివారం అమలు కార్యక్రమం కిలగాడలో నిర్వహించారు. ఈసందర్భంగా సన్యాసమ్మ మాట్లాడుతూ మండలంలోని 23 పంచాయతీల్లోని మొత్తం 7, 619 మందికి మొత్తం రూ. 5కోట్లకు పైగా నిధులు విడుదల కానున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోడా శివశంకర్, నేతలు బాబూజీ, సికరి సూర్యనారాయణ, చిట్టపులి చిరంజీవి పడాల్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: సీతగుంట వ్యవసాయ కార్యాలయంలోఅన్నదాత సుఖీభవపై రైతులకు అవగహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ వరహాలమ్మ, ఎంపీటీసీ సభ్యులు, ఏవో, గుంటూరుకు చెందిన రైతులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ 3 విడతలుగా అన్నదాత సుఖీభవ సొమ్ము రైతుల ఖాతాలోజమవుతుందన్నారు. మండలంలోని రైతు లు 9469 మందికి సుమారు రూ. 1.62 కోట్లు మంజూరుకానున్నట్టు చెప్పారు. బ్యాంకులో ఆధార్ లింక్ లేనివారు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

కానిస్టేబుళ్లుగా ఎంపికైన అన్నదమ్ములు


కానిస్టేబుళ్లుగా ఎంపికైన అన్నదమ్ములు

పెదబయలు, ఆగస్టు 2 (ఆంధ్ర జ్యోతి): శుక్రవారం విడుదలైన ఆంధ్రప్రదేశ్ సివిల్ కానిస్టేబుల్ ఎంపిక రాత పరీక్షల ఫలితాల్లో మండలానికి చెందిన అన్నదమ్ములు సత్తా చాటారు. బొండపల్లి పంచాయతీ- ఎగువ బొండపల్లి గ్రామానికి చెందిన గిరిజన రైతు అయిన బడ్డాన్న, వరహాలమ్మ దంపతుల కుమారులు శివశంకర వరప్రసాద్, హరిశ్చంద్ర ప్రసాద్‌లు సివిల్ కానిస్టేబుల్స్‌గా ఎంపిక అయ్యారు. శివశంకర్ వర ప్రసాద్ 200 మార్కులకు 94, హరిశ్చంద్ర ప్రసాద్‌కు 200కు 105 మార్కులు సాధించారు. తల్లిదండ్రులు వ్యవసాయ రైతులైనా.. కుమారులిద్దరికీ అవనిగెడ్డలో కోచింగ్ అందించారు. డిగ్రీ, డైట్, బీఈడీ చదివి ఇటు టీచర్ ఉద్యోగానికి, కానిస్టేబుల్ ఉద్యోగానికి ఐదేళ్లగా సిద్ధమవుతున్నారు. అయితే, అన్నదమ్ములిద్దరూ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. బడ్డాన్న మరో ఇద్దరు కుమార్తెలున్నారు. వారు టీచర్ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఇప్పుడు కుమారులు కానిస్టేబుల్స్‌గా ఎంపిక కావడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

పేదరికాన్ని అధిగమించి..

- పోలీసు ఎంపికలో రాజు


తల్లి పార్వతితో.. కానిస్టేబుల్ ఉద్యోగానికి అర్హత సాధించిన రాజు

అనంతగిరి, ఆగస్టు 2 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కొండిబ పంచాయతీ కేంద్రానికి చెందిన పల్లి పార్వతమ్మ కుమారుడు పల్లిరాజు సివిల్ పోలీస్ కా నిస్టేబుల్ ఉద్యోగానికి అర్హత సాధించాడు. తండ్రి గురు కొన్నేళ్ల క్రితం మృ తి చెందగా.. తల్లి పార్వతి, అక్కాచెల్లెల్లు మాలతి, లక్ష్మీ తోడ్పాటు నందించారు. నిరుపేద కుటుంబ కావడం వ్యవసాయం పై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో పల్లి. రాజు మాట్లాడు తూ..2016లో ఎస్. కోటలో డిగ్రీ, 2018 లో డైట్ పూర్తిచేసిన తరువాత డీఎస్సీ, గ్రూపు-2పరీక్షలు రా శానన్నారు. అనంతరం పట్టు దలతో కుటుంబ సభ్యుల సహకారంతో ముందుకు సాగి, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి పరీక్ష రాసినట్టుచెప్పారు. 90 మార్కులతో అర్హత కావడంపై చాలా సంతోషంగా ఉం దన్నా రు. కుటుంబానికి ఆసరాగా ఉంటానన్నారు.

మాచ్‌ఖండ్‌లో శతశాతం విద్యుత్ ఉత్పాదనకు కృషి

- సీలేరు కాంప్లెక్స్ సీఈ రాజారావు


డుడుమ జలాశయంపై పవర్ గేట్‌ను పరిశీలిస్తున్న సీఈ రాజారావు

ముంచంగిపుట్టు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో శతశాతం విద్యుత్ ఉత్పాదనకు కృషి చేస్తున్నామని సీలేరు కాంప్లెక్స్ సీఈ కె.వి.రాజారావు అన్నారు. శనివారం ఆయన మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. డుడుమ జలాశయం పవర్ గేట్లు సక్రమంగా పని చేయక పోవడంతో నీటిని విడుదలకు గత కొద్ది రోజులుగా సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న సీఈ ప్రాజెక్టును సందర్శించి, పవర్ గేట్లను పరిశీలించారు. ప్రస్తుతం గేట్ల పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. జోలాపుట్టు, డుడుమ జలాశయాల్లో నీటి నిల్వలపై ఆరా తీశారు. ప్రాజెక్టులో చేపడుతున్న 4వ నెంబరు జనరేటర్ మరమ్మతు పనులను పరిశీలించారు. త్వరగతిని జనరేటర్ వినియోగంలోకి వచ్చే విధంగా చూడాలని ప్రాజెక్టు అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలాశయం వద్ద అన్ని గేట్లు పని చేసేలా తగు చర్యలు చేపడుతున్నామని, విద్యుత్ ఉత్పాదన శతశాతం జరిగేలా కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ స్థితిలో జనరేటర్ల మరమ్మత్తుపనులు పూర్తి చేస్తున్నట్టు వివరించారు.. ఈ కార్యక్రమంలో మాచ్‌ఖండ్ ప్రాజెక్టు ఇన్‌చార్జి ఎస్‌ఈ బి.గోవిందరాజు, తదితరులు పాల్గొన్నారు.

వారపు సంతలో పోలీసులు విస్తృత తనిఖీలు

ముంచంగిపుట్టు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతలో పోలీసులు విస్తృత వాహన తనిఖీలు చేపట్టారు. సీపీఐ మావోయిస్టు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల నేపథ్యంలో అప్రమత్తమయ్యారు. మారుమూల గ్రామాల నుంచి సంతకు వచ్చి, వెళ్లే వాహనాలను, ప్రయాణికుల లగేజీలు, బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అలాగే మండల కేంద్రం నుంచి జోలాపుట్టు, కుజభంగి, సంగడ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారుల జంక్షన్ల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీసులు గస్తీ నిర్వహిస్తూ అటుగా వెళ్లిన వాహనాలను తనిఖీలు చేపడుతున్నారు. రాత్రి బస్సు సర్వీసులను రద్దు చేశారు.

కుమ్మరిపుట్టులో వైద్య శిబిరం


చిన్నారికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ముంచంగిపుట్టు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ డివిజన్ నేత, దారెల సర్పంచ్ పి.పాండురంగస్వామి అన్నారు. మండలంలోని కిలగాడ పీహెచ్‌సీ పరిధిలో దారెల పంచాయతీ కుమ్మరిపుట్టు గ్రామంలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్న సుమారు 43 మందికి వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను అందించారు. పాండురంగస్వామి దగ్గరుండి పలువురికి సికిల్ సెల్ అ నీమియా పరీక్షలను చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన శిశువు నుంచి 40 ఏళ్ల వయసు వరకు ప్రతీ ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. సికిల్ సెల్ అనీమియా ఉందని నిర్ధారణ అయితే, పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

గంజాయి రవాణా చేస్తే నాన్‌బెయిలబుల్ కేసులు: సీఐ


గంజాయి కేసులో నిందితులతో మాట్లాడుతున్న సీఐ

సీలేరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : గంజాయి రవాణా జోలికి వెలితే నాన్‌బెయిలబుల్ (ఎన్‌డీపీఎస్) కేసులు తప్పవని జీకేవీధి సీఐ వరప్రసాద్ హెచ్చరించారు. శనివారం జీకేవీధి మండలం సీలేరు పోలీస్టేషన్ పరిధిలోని ధారకొండ, దుప్పులవాడ, గాలికొండ, సీలేరు పంచాయతీ పరిధిలో గతంలో గంజాయి కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న వారికి సీఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా, సాగు వంటి కార్యకలాపాలకు మళ్లీ పాల్పడితే ఈ సారి జైలు నుంచి బయటకు కాకుండా ఎన్‌డీపీఎస్ కేసు చేస్తామని హెచ్చరించారు. అలాగే, ఆస్తులు కూడా సీజ్ చేయాల్సి ఉంటుందని సీఐ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీలేరు ఎస్ఐ రవీంద్ర పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగిన గరిష్ఠ ఉష్ణోగ్రతలు

పాడేరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ముసురు వాతావరణం క్రమంగా తగ్గుముఖం పట్టడడంతో మన్యంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు స్వలంగా పెరుగుతున్నాయి. అలాగే, పగటి వేళల్లో ఎండ సైతం ప్రభావం చూపుతున్నది. శనివారం కొయ్యూరులో 36.1 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా అరకులోయలో 32.7, పాడేరులో 32.4, డుంబ్రిగుడలో 31.7, జీకేవీధిలో 31.5, పెదబయలులో 30.8, చింతపల్లిలో 30.3, హుకుంపేటలో 29.4, ముంచంగిపుట్టులో 29.0 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఆర్ఐకు సన్మానం

అనంతగిరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు బదిలీలు సర్వసాధారణమని తహశీల్దార్ వీరభద్రచారి అన్నారు.. స్థానిక రెవెన్యూ కార్యాలయంలోని ఆర్ఐగా విధులు నిర్వహిస్తూ.. అరకువేలికి బదిలీపై వెళ్లిన పట్నాసీ శంకరరావుకు శనివారం సన్మాన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శంకరరావు కొనియాడారు. డిప్యూటీ తహశీల్దార్ వి. మాణిక్యం, వీఆర్వోల అసోసియేషన్ పాడేరు డివిజన్ అధ్యక్షుడు కోటిబాబు, వీ ఆర్వోల మండల అధ్యక్షుడు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ పీపుల్స్ చారిటబుల్ ట్రస్ట్ ఔదార్యం

- సొంత నిధులతో కెందుగూడలో పాఠశాల భవన నిర్మాణం


భవనం ప్రారంభోత్సవం చేస్తున్న ఎంఈవో కృష్ణమూర్తి

ముంచంగిపుట్టు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):ఆదివాసీ విద్యార్థులకు గూడు లేక చదువుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన కాకినాడకు చెందిన పీపుల్స్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు ఔదార్యం చూపారు. వారి సొంత నిధులతోపాటు పలువురి సహకారంతో పాఠశాల భవనాన్ని నిర్మించారు. వివరాలివి.. మండలంలోని కుమడ పంచాయతీ కెందుగూడ గ్రామంలో ఎంపీపీ పాఠశాలకు పక్కా భనం లేక చిన్నారులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. గతేడాది ఈ వివిధ ప్రతికల్లో కథనాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పీపుల్స్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు స్పందించి సుమారు రూ. 2. 35 లక్షలు వెచ్చించి నూతన భవనాన్ని నిర్మించారు. ఆ భవనాన్ని ఎంఈవో కృష్ణమూర్తి చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ ఇక్కడి విద్యార్థుల సమస్యలను తెలుసుకుని తొలుత గ్రామాన్ని సందర్శించామన్నారు. అనంతరం కాకినాడకు చెందిన చాగంటి వెంకట, కడపకు చెందిన కేతవరపు రవికిశోర్, హైదరాబాద్‌కు చెందిన మద్దిరాల అగస్టిన్ భవన నిర్మాణానికి ఆర్థిక సహాయాన్ని అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.గ్లోరీ, అనిత, సింహాద్రి, సీఆర్‌పీలు సురేష్, సూర్య, అనిల్, గౌరీ, హరి, భాస్కర్, ట్రస్ట్ ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


రూ. 2. 35 లక్షలతో నిర్మించిన పాఠశాల నూతన భవనం

తల్లిపాలపై అవగాహన ర్యాలీ


ఎస్ఆర్‌పురంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు

అనంతగిరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ఆర్ పురం పం చాయతీ కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్త సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ శనివారం నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాలపై అవగాహన కల్పించారు. గర్భిణులు పౌష్టికాహారం సక్రమంగా తీసుకోవడం ద్వారా తల్లిబిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలోని స్థానిక గిరిజనులు పాల్గొన్నారు.

కొత్తగా మంజూరైన పింఛన్లు పంపిణీ

సీలేరు, ఆగస్టు 2 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరు పంచాయతీ పరిధిలో కొత్తగా మంజూరైన మూడు పింఛన్లను లబ్ధిదారులకుస్థానిక సచివాలయంలో శనివారం సిబ్బంది పంపిణీ చేశారు. సీలేరుకు చెందిన చింతలపూడి అప్పయమ్మ, సీసీ పద్మ, రొర్రా గురువైరిలకు ప్రభుత్వం వితంతు పింఛన్లను ఈ నెల నుంచి కేటాయించింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి దుర్గో, ఎంపీటీసీ సభ్యులు పిల్లా సాంబమూర్తి, వైస్ సర్పంచ్ కె వల్లీప్రసాద్, కూటమి నాయకులు కాశీ, సన్యాశిరావు, మారిబాబు, డీసీసీ కార్యదర్శి కారే శ్రీనివాస్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఫ్యాప్టో ఉపాధ్యాయులు

పాడేరురూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా చైర్మన్ రావుల జగన్మోహనరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో శనివారం ఐటీడీఏ , జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టారు. సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జగన్మోహనరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతరపనులనుంచి విముక్తి కలిగించాలన్నారు. ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలు లేవన్న నెపంతో రెండు నెలలుగా నిలిపిన జీతాలు చెల్లించాలని, 2023 జూలైలోని పీఆర్సీని ఇప్పటి వరకు ఇవ్వలేదని, మూడు డీఏలు పెండింగ్ ఉన్నా యన్నారు. గత మే నెలలో బదిలీ జరిగి నేటి వరకు రిలీవ్ కాని ఉపాధ్యాయులకు వారు కోరుకున్న పాఠశాలలకు తరలించాలన్నారు, ఉమ్మడి సర్వీసు తీసుకువచ్చి కామన్ సీనియారిటీ ప్రాతిపదికన ప్రమోషన్లు కల్పించాలని, పాత పెన్షన్ విధానాన్ని తీసుకురావాలని తదితర 18 డిమాండ్లపై డిమాండ్ చేస్తూ ఈ ధర్నా చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా నాయకులు ముఖి రామకృష్ణ, వి.మహేశ్, కె.ధనుర్జయ్, ఎస్.శేషగిరి, పి.కర్రన్న, గిరిజన ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు పలాసి కృష్ణారావు, ట్రైబల్ వెల్ఫేర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ, గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖి శేషాద్రి, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తల్లిపాలతో శిశువుల్లో రోగ నిరోధక శక్తి


బాలింతలను సన్మానిస్తున్న ఐసీడీఎస్ ఉద్యోగులు

గూడెంకొత్తవీధి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి):తల్లిపాల వల్ల శిశువుల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ మోహిని అన్నారు. శనివారం మండలంలోని ఊబపొలం గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు పురస్కరించుకుని అంగన్‌వాడీ కార్యకర్తలు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాలింతలకు సన్మానాలు చేశారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ శిశువులకు ఆరు నెలల పాటు తల్లి పాలు పెట్టాలన్నారు. శిశువులకు తల్లిపాలు ఔషధంలా పనిచేస్తుందని, శిశువులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ వలసమ్మ పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


డివైడర్‌ను ఢీకొని దెబ్బతిన్న కారు

డుంబ్రిగుడ, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 516ఈ హైవే రోడ్డు అంత్రిగుడ సమీప మలుపులో పర్యాటకులకు చెందిన కారు డివైడర్‌ను శనివారం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలుకాకున్నా, కారు నుజ్జు నుజ్జయింది. అరకు అందాలను తిలకించడానికి వచ్చిన పర్యాటకులు చాపారాయి జలవిహారీలో సందర్శించి తిరిగి అరకు చేరుకునే క్రమంలో ఎ దురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో డివైడర్‌ను వీరి కారు బ లంగా ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న విశాఖకు చెందిన నలుగురు పర్యాటకులకు గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

రైతు భరోసా పథకంపై అవగహన


అవగహన చేస్తున్న టీఎస్‌టీయూసి ప్రధాన కార్యదర్శి స్వామి

డుంబ్రిగుడ, ఆగస్టు 2 (ఆంధ్ర జ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం ప్రత్యేక ప్రసారం నిర్వహించారు. టీఎస్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి గిరిజన రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అందించే సూపర్ సిక్స్ పథకాలపై అవగహన కల్పించారు.

'సుఖీభవ' సాయం సద్వినియోగం చేసుకోండి

- జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్
- బ్యాంకులో జమ కాకుంటే 155251 నంబర్‌కు ఫోన్ చేయండి


కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్

పాడేరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అన్నారు. 'అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్' తొలి విడత ఆర్థిక సాయం జమ సందర్భంగా శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించాలనే లక్ష్యంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూడు విడతలుగా ప్రతి ఏడాది రూ.20 వేలను రైతుల ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. ఈఏడాది తొలి విడతగా జిల్లా వ్యాప్తంగా 1లక్షా 44వేల 222 మంది రైతులకు రూ.101 కోట్ల 84 లక్షలు లబ్ధి చేకూరుతుందన్నారు. తక్షణమే రైతులకు అన్నదాత సుఖీభవ సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమ కాకుంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అటువంటి సమస్యలుంటే కాల్ సెంటర్ 155251 నంబర్‌కు సమాచారం ఇస్తే పరిష్కరిస్తారన్నారు. రైతులకు సొమ్ము జమ కాని పరిస్థితులపై అధికారులు దృష్టి సారించి, వారికి సొమ్ము జమయ్యేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ సూచించారు. అలాగే గిరిజన ప్రాంతంలో రానున్న మూడేళ్లలో లక్ష ఎకరాల్లో కాఫీ తోటల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించి ఆర్గానిక్ జిల్లాగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ మాట్లాడుతూ... అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ సాయాన్ని రైతులు వినియోగించుకుని చక్కని ప్రయోజనం పొందాలన్నారు. జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, జనసేన అరకులోయ ఇన్‌చార్జి వంపూరు గంగులయ్య, ఏఎంసీ చైర్‌పర్సన్ మచ్చల మంగతల్లి, పలువురు రైతులు మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాలోని 1 లక్షా 44 వేల 222 మంది రైతులకు రూ.101 కోట్ల 84 లక్షల లబ్ధి చేకూరే చెక్‌ను అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నంద్, రైతు సాధికారత సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎల్.భాస్కరరావు, ఎంపీపీ ఎస్.రత్నకుమారి, జడ్పీటీసీ సభ్యురాలు కిముడు గాయత్రి, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, ఏపీ టూరిజం డైరెక్టర్ కిల్లు వెంకటరమేశ్‌నాయుడు, సర్పంచులు కొట్టగుళ్లి ఉషారాణి, పాండురంగస్వామి, రైతులు పాల్గొన్నారు.

రామరాజుపాలెం వద్ద టోల్‌గేట్ సిద్ధం

- త్వరలో వాహనదారులనుంచి పన్ను వసూలు


రామరాజుపాలెం వద్ద రూపు దిద్దుకుంటున్న టోల్‌ప్లాజా

కొయ్యూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 516 ఈ నిర్మాణం దాదాపు తుది దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో ఈ మార్గంలో ప్రయాణించే వాహనాలపై పన్ను వసూలుకు వీలుగా టోల్‌ప్లాజాలను సిద్ధం చేస్తున్నారు. రాజమహేంద్రవరంనుంచి మండలం మీదుగా అరకు వరకు నిర్మాణాలు చేపట్టిన జాతీయ రహదారిలో మండల పరిధిలో కాకరపాడు నుంచి కాట్రగెడ్డ వరకు సుమారు 35 కిలోమీటర్ల మేర ఉంది. ఇందులో భాగంగా ప్రమాద హెచ్చరికలతో కూడిన బోర్డులు, గ్రామాలు తెలిపే నేమ్ ప్లేట్‌లతోపాటు ప్రధాన గ్రామాలలో వీధిలైట్లు ఏర్పాటు చేశారు. ఈ రహదారిపై ప్రయాణించే వాహనాలపై వాహనాల ట్యాక్స్ వసూలుకు వీలుగా రామరాజుపాలెం వద్ద టోల్‌గేట్ నిర్మించారు. టోల్‌గేట్‌కు అనుసంధానంగా రెండు వైపులా 120 టన్నుల సామర్థ్యం గలిగిన వేబ్రిడ్జిల పనులు చురుగ్గా సాగుతున్నాయి. నెల రోజుల వ్యవధిలో ఈ రహదారిపై ప్రయాణించే వాహనాలపై టోల్‌ఫీజు వసూలుకు రంగం సిద్ధమవుతోంది. ఇందుకు వీలుగా ఒక్కో వాహనానికి ఒక్కో రీతిగా టోల్ ఫీజు వసూలు చేయనున్నారు. నిర్దేశిత ఫీజు వివరాలు తెలిపే బోర్డులు ఇంకా ఏర్పాటు చేయాల్సి ఉంది.

రీ సర్వే తప్పిదాలపై సభ్యుల ఆగ్రహం

- గ్రావెల్ అక్రమ తవ్వకాలపై నిలదీత
- రెవెన్యూ అలసత్వమేనని తహశీల్దార్‌పై అసంతృప్తి
- నీటి తీరువా వసూళ్లపై ఒత్తిడి చేయడం సరికాదు
- వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం



రెవెన్యూ సమస్యలపై తహశీల్దార్‌ను ప్రశ్నిస్తున్న సభ్యులు

చోడవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేలో తప్పిదాలు.. వాటిని సరిదిద్దడంలో రెవెన్యూ శాఖ అలసత్వంపై సభ్యులు మండిపడ్డారు. రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని తహశీల్దార్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గాడి కాసు అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో, మండల ఇంజనీర్ శాంతారాం సమావేశాన్ని నడిపించగా, ఆద్యంతం వాడీవేడిగా సాగింది. గాంధీగ్రామం సర్పంచ్ గాడి అప్పారావు, అందకుపాలెం చందు పరమేశ్వరి మాట్లాడుతూ తమ గ్రామాలకు రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. దీనిపై తహశీల్దార్ అంబటి రామారావు స్పందిస్తూ, రెవెన్యూ సిబ్బంది రీ సర్వేలో ఉండడం వల్ల అందుబాటులో ఉండడం లేదని, ఇకపై వారానికి ఒక రోజు సచివాలయంలో ఉండేలా చూస్తామని హామీ ఇచ్చారు. కన్నంపాలెం, చాకిపల్లి సరిహద్దు వివాదంతో పాటు కన్నంపాలెంలో పేదల కోసం స్థలం కేటాయింపు, జన్నవరంలో రీ సర్వే తప్పిదాలు సరిదిద్దే విషయంలో రెవెన్యూ సిబ్బంది అలసత్వం వహిస్తున్నారని తహశీల్దార్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలపైనా చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. ఇక గ్రామాల్లో ప్రభుత్వం ప్రకటించిన పేదలకు మూడు సెంట్ల స్థలం గురించి సమాచారం ఎందుకు ఇవ్వలేదని సభ్యులు తహశీల్దార్‌ను ప్రశ్నించారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ రహదారుల సమస్యలపై జేఈ సత్యప్రసాద్ మాట్లాడుతూ, బీఎన్ రోడ్డులో మరమ్మతు పనులు చేపట్టామని, వంతెనల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యా ప్రమాణాలు, క్రమశిక్షణ సరిగ్గా ఉండడం లేదని సభ్యులు ఎంఈవో దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై ఎంఈవో సింహాచలం మాట్లాడుతూ, హైస్కూల్ పరిస్థితిపై విచారణ చేయిస్తామని హామీ ఇచ్చారు.

నీటి తీరువాపై ఒత్తిడి చేయడం సరికాదు

సాగునీటి కాలువల నిర్వహణ సరిగ్గా లేకుండా నీటి తీరువా వసూళ్లకు ఒత్తిడి చేయడం సరికాదని సభ్యులు మండిపడ్డారు. గ్రామాల్లో నీటితీరువా వసూళ్లు చేపట్టవద్దని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు డిమాండ్ చేశారు. దీనిపై తహశీల్దార్ రామారావు మాట్లాడుతూ, ప్రభుత్వం నీటి తీరువాపై వడ్డీ మాఫీ చేసిందని, అందువల్ల నీటితీరువా బకాయిలు చెల్లించాలని సూచించారు. దీంతో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు ముక్తకంఠంతో తహశీల్దార్‌తో వాదనకు దిగారు. సాగునీటి కాలువలు బాగులేవని, పంటలకు సాగునీరు అందడం లేదని, ఇటువంటి పరిస్థితుల్లో నీటి తీరువా కట్టాలని ఒత్తిడి చేయడం భావ్యం కాదని నిలదీశారు. తమ గ్రామాల్లో నీటి తీరువా చెల్లించవద్దని దండోరా వేయిస్తామంటూ సభ్యులు హెచ్చరించారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తీరువా చెల్లించినట్టయితే కాలువల నిర్వహణకు ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తుందని నచ్చచెప్పేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ సభ్యులు మాత్రం ససేమిరా తీరువా వసూళ్లు నిలిపివేయాలంటూ తీర్మానానికి పట్టుబట్టారు.ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు బైన ఈశ్వరరావు, శరగడం నాగేశ్వరరావు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



పింఛన్ల పంపిణీ కార్యక్రమలో మాట్లాడుతున్న స్పీకర్

పింఛన్లతో వితంతువులకు ఆర్థిక భరోసా

- స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం అర్బన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వితంతువులకు పింఛన్లు అందించడం ద్వారా ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తున్నదని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జీవిత భాగస్వామ్య పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్న మాట్లాడుతూ దివ్యాంగులకు, వృద్ధులు, వితంతువులకు దేశంలో ఎక్కడా లేని విధంగా అధిక మొత్తంలో పింఛన్లు అందిస్తున్నట్టు చెప్పారు. ఇందుకోసం ప్రతి నెలా సుమారు రూ.2,750 కోట్లను ప్రభుత్వం కేటాయిస్తున్నదన్నారు. అనకాపల్లి జిల్లాలో 2.6 లక్షల మంది లబ్ధిదారులకు నెలకు రూ.110 కోట్లు పింఛన్ల ద్వారా అందిస్తున్నామన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో కొత్తగా 753 జీవిత భాగస్వామి పింఛన్లను అందించినట్టు స్పీకర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి, జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, నర్సీపట్నం ఏఎంసీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, వేములపూడి ఎంపీటీసీ సభ్యులు బొళెం రాంప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు లాలం శ్రీరంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లూ దోచుకుని దాచుకున్నారు..

జగన్‌కు బటన్ నొక్కడం తప్ప వ్యవసాయం గురించి ఏం తెలుసు

మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



రైతులకు అన్నదాత సుఖీభవ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే బండారు

దేవరాపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో గత ఐదేళ్లూ దోచుకుని దాచుకోవడం తప్పితే చేసిందేమీ లేదని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. స్థానిక రైవాడ అతిథి గృహం ఆవరణలో అన్నదాత సుఖీభవ నియోజకవర్గ స్థాయి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బటన్ నొక్కడం తప్పితే జగన్మోహన్‌రెడ్డికి వ్యవసాయం గురించి ఏం తెలుసని, రైతుకు చేసిన మేలు ఏమిటని ప్రశ్నించారు. ఐదేళ్లలో రైతుకు సంబంధించిన ఏ పనులు జరగలేదన్నారు. నియోజకవర్గంలో ఐదు జలాశయాలు ఉంటే, ఒక్క జలాశయానికి రూపాయ ఖర్చు చేయలేదన్నారు. రైతులు కోరినది ఇవ్వడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సిద్ధంగా ఉన్నారన్నారు. పోలవరం నీరు విశాఖకు వచ్చిన వెంటనే రైవాడ నీటిని రైతులకు అంకితం చేయడంతో పాటు ఆరు వేల ఎకరాల అదనపు ఆయకట్టుకు నీటిని అందిస్తామన్నారు. రైతును అన్ని విధాలా ఆదుకోవడానికి అన్నదాత సుఖీభవ పథకం పెట్టి, రైతుల ఖాతాల్లోకి నగదు జమ చేశారన్నారు. మాడుగుల నియోజకవర్గంలో 45,355 మంది రైతులకు రూ.30.21 లక్షల నగదు జమ చేసినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, రైవాడ జలాశయం చైర్మన్ పాత్రునాయుడు, మండల వ్యవసాయాధికారి ఎల్.వై.కాంతమ్మ, వ్యవసాయ విస్తరణాధికారి కిరణ్‌కుమార్ కూటమి నాయకులు పాల్గొన్నారు.

ధాన్యంతో సీఎం చంద్రబాబుకు అభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి ధాన్యంతో అభిషేకం చేస్తున్న దృశ్యం

నర్సీపట్నం అర్బన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపూడి గ్రామంలో శనివారం సీఎం నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి ధాన్యంతో అభిషేకం చేశారు. వేములపూడి రైతు సేవా కేంద్రంలో ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఎంపీటీసీ సభ్యుడు బొళెం రాంప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన అన్నదాత సుఖీభవ పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేయడం సంతోషకరమన్నారు. ఈ పథకంతో రైతులను ఆదుకుంటున్న చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రజా వేదిక



ప్రజా వేదికలో విచారణ చేపడుతున్న తహశీల్దార్

గొలుగొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్టు తహశీల్దార్ శ్రీనివాసరావు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజా వేదికలో ఆయన మాట్లాడారు. పాతమల్లంపేట గ్రామంలో భూ సమస్యలపై రైతులు గతంలో ఇచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టామన్నారు. ఇరు వర్గాలతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రాజు, పలు శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

అల్లూరి పార్కులో జన సేవాదళ్ శిక్షణ తరగతులు



కర్ర సాము నేర్చుకుంటున్న జన సేవాదళ్ సభ్యులు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక అల్లూరి పార్కులో జన సేవాదళ్ శిక్షణ తరగతులను శనివారం నిర్వహించారు. సీపీఐ వందో సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి ఒంగోలులో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తామని, ఇందుకోసం సేవాదళ్ సభ్యులకు కర్ర సాము, మార్చింగ్‌పై శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. జన సేవాదళ్ వలంటీర్లు ప్రజలకు సేవ చేయడమే ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శులు ఎం.రామునాయుడు, పి.సత్యనారాయణ, నాయకులు రాజాన దొరబాబు, గురుబాబు, ఎం.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సాగుకు భరోసాకే అన్నదాత సుఖీభవ

- చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు... పాల్గొన్న నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు, రైతులు

రావికమతం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అన్నదాతకు అండగా ఉంటూ సాగుకు భరోసా ఇవ్వాలన్న ఉద్దేశంతోనే అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం అమలు చేస్తున్నట్టు చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నియోజకవర్గ స్థాయిలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రైతులు, మహిళలు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. దీంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన అందరికీ ఈ పథకం ద్వారా ఆర్థిక సాయం అందుతుందన్నారు. చోడవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 50,733 మంది రైతులకు రూ.35.51 కోట్లు రైతుల ఖాతాలోకి ప్రభుత్వం జమ చేసిందని చెప్పారు. అనివార్య కారణాల వల్ల అర్హత ఉండి కూడా పథకం అందకుంటే తన దృష్టి తేవాలన్నారు. అలాగే గ్రామ సచివాలయంలో వ్యవసాధికి తెలపాలని సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తొలి విడగా సీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు రూ.7 వేలు జమ చేశారన్నారు. రెండో విడత మరో రూ7 వేలు, మూడో విడతగా మరో రూ.6 వేలు చొప్పున అందిస్తారని ఆయన వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంతో పాటు యుతకు ఉపాధి కల్పన, వ్యవసాయ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించడం ఆనందకరమన్నారు.

ఎడ్ల బండిపై భారీ ఊరేగింపు

అంతకు ముందు ఎమ్మెల్యే రాజు, టీడీపీ నాయకులను ఎడ్ల బళ్లపై ఎక్కించి పెంట్రోల్ బంకు నుంచి రైతులు, మహిళలు హైస్కూల్ సభా వేదిక వరకు పూల వర్షం కురిపిస్తూ జై చంద్రబాబు, జై ప్రధాని నరేంద్ర మోదీ, జై పవన్‌కల్యాణ్ అంటూ నినాదాలు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు కోమటి శంకరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామస్వామి, తహశీల్దార్ అంబేడ్కర్, రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు గూనూరు మల్లునాయుడు, నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు కోట నీలవేణి, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టీడీపీ మండల కార్యదర్శి ఉగ్గిన శ్రీను, రావికమతం ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు, ఎంపీటీసీ గంజి సూర్యనారాయణ,బీజేపీ మండల అధ్యక్షుడు గుటాల చిన్న, నాలుగు మండలాలకు చెందిన టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పిల్లలను అప్పగిస్తే సంరక్షిస్తాం

- ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి

చోడవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పిల్లలను కని చెత్త కుప్పల్లో పారేయవద్దని, తమకు అప్పగిస్తే సంరక్షిస్తామని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి తెలిపారు. మండలంలోని గోవాడ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఇటీవల గోవాడలో పసిబిడ్డను మురుగుకాలువలో పడేసిన ఘటనలు చోటు చేసుకోవడం దురదృష్టకరమని వాపోయారు. ఇలా అవగాహన లేని చర్యలకు పాల్పడవద్దని, పెంచలేని పక్షంలో బాలల సంరక్షణ కేంద్రాలకు అప్పగిస్తే సంరక్షణ బాధ్యతలు తీసుకుంటామని ఆమె చెప్పారు. ఈ సదస్సులో సీఐ బి.అప్పలరాజు మాట్లాడుతూ పోక్సో, సైబర్ సెక్యూరిటీ చట్టం, హ్యూమన్ ట్రాఫికింగ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ మంజుల వాణి, డీసీపీవో సునీతరాణి పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కు సీడీపీవోగా పదోన్నతి



ఎం.రాజేశ్వరి

నర్సీపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ ఎం.రాజేశ్వరి సీడీపీవోగా పదోన్నతి పొందారు. నర్సీపట్నం ప్రాజెక్ట్‌లో గ్రేడ్-1 సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న ఆమె శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం సీడీపీవోగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా సీడీపీవో జీవీరమణ, సూపర్‌వైజర్లు, సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

డిఫెన్స్ మద్యంతో ఒకరి అరెస్టు

నర్సీపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): డిఫెన్స్ మద్యం బాటిళ్లతో ఒక వ్యక్తిని శనివారం అరెస్టు ఎక్సైజ్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. మాకవరపాలెం మండలం వజ్రగడ గ్రామానికి చెందిన గాజుల సత్తిబాబు 11 డిఫెన్స్ మద్యం బాటిళ్లతో చంద్రయ్యపాలెం బస్టాప్ వద్ద ఉండగా అరెస్టు చేశామన్నారు. ఆయన దగ్గర నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ దాడులలో హెచ్‌సీ వై.నాగశంకర్, గోవర్ధన్, ఉషా పాల్గొన్నారని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

దేవరాపల్లి, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అలమండ ఫీడర్‌లో సోమవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ఏఈఈ కర్రి శంకరరావు శనివారం తెలిపారు. 24 గంటల విద్యుత్ సరఫరాను ఇవ్వడంలో భాగంగా లైన్లలో ఉన్న సమస్యలను పరిష్కరించే పనులు చేపట్టడం కోసం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాను నిలుపుదల చేస్తామని ఆయన చెప్పారు. ఈ అంతరాయాన్ని ప్రజలు గమనించిన సహకరించాలని కోరారు.

వడ్డాదిలో ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు

బుచ్చెయ్యపేట ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాది గ్రామంలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై సామానిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన బృందం గ్రామాల్లో పర్యటిస్తూ ఆడిట్ చేస్తున్నారు. ఎస్సార్పీలు అప్పారావు, రామచంద్ర పర్యవేక్షణలో డీఆర్పీ సతీశ్ ఆధ్వర్యంలో ఈ ఆడిట్ జరుగుతోంది. గృహ నిర్మాణ శాఖ, ఉపాధి హామీ పథకం, సోషల్ ఫారెస్ట్ తదితర పనులకు వెచ్చించిన నిధులకు, కూలీలకు చెల్లించిన వేతనాలు తదితర అంశాలపై బృందం ప్రతినిధులు లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు సేకరిస్తున్నారు. ఈ తనిఖీ నివేదికను ఈ నెల 11వ తేదీన జరిగే గ్రామసభలో వెల్లడిస్తామని ఎస్సార్పీలు తెలిపారు.

తల్లి పాల వారోత్సవాలు

కె.కోటపాడు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడువాడ, కింతాడ శివారు రామచంద్రపురం గ్రామాల్లో శనివారం తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. చౌడువాడ పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో లలితకుమారి పాల్గొని మాట్లాడారు. తల్లి పాలు బిడ్డ హక్కు అన్నారు. తల్లి పాలు ఇవ్వడం వల్ల బిడ్డతో పాటు అమ్మకు కూడా శారీరకంగా, మానసికంగా రక్షణ లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ కె.మాలం నాయుడు, నాయకులు జూరెడ్డి రాము, రొంగలి అప్పలనాయుడు, కొల్లి స్వామినాథం, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కాంప్లెక్స్‌లో పిల్లలకు పాలు పట్టించే కేంద్రం

చోడవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో చిన్నారులకు పాలు పట్టించేందుకు శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌ను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు శనివారం సాయంత్రం ప్రారంభించారు. ప్రయాణాల్లో మహిళలు చంటి బిడ్డలకు పాలు ఇచ్చేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని సూర్యలక్ష్మి, ఇతర అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకు ముందు లక్ష్మమ్మ కోవెల వద్ద కల్యాణ మండపంలో పౌష్టికాహార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, టీడీపీ నాయకులు గూనూరు మల్లునాయుడు, ఇన్‌చార్జి ఎంపీడీవో శాంతారాం, ఎంపీటీసీ సభ్యులు కొట్టాపు రూపాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు పథకం జయప్రదం చేయాలి

- జిల్లా ప్రజా రవాణా అధికారిణి వి.ప్రవీణ

నర్సీపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని విజయంతం చేయాలని జిల్లా ప్రజా రవాణా అధికారిణి వి.ప్రవీణ సూచించారు. శనివారం నర్సీపట్నంలో డిపోమేనేజర్ ధీరజ్, సిబ్బందితో ఆమె సమీక్షించారు. మహిళా ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. బస్సుల కండీషన్ పక్కాగా ఉండాలని గ్యారేజ్ సిబ్బందికి సూచించారు. డిపో నుంచి బస్సు బయలుదేరిన తర్వాత మార్గమధ్యంలో మహిళలు చెయెత్తి ఆపితే తప్పనిసరిగా ఎక్కించుకోవాలని సూచించారు. జీరో ఫేర్ టిక్కెట్ జారీపై సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని ఆమె ఆదేశించారు. ఉచిత ప్రయాణం పథకంలో ఎటువంటి ఆటంకాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్యారేజ్ ఇన్‌చార్జ్ పి.అచారి, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి

నర్సీపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ సైనికాధికారుల స్థలంలో అక్రమ నిర్మాణాలు ఆపాలని ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్‌వో) రాష్ట్ర కార్యదర్శి ఇ.మహేశ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్థలాన్ని పురావస్తు శాఖకు అప్పగించి అభివృద్ధి చేయాలని కోరారు. అల్లూరి అనుచరులు చేతిలో హతమైన సైనికాధికారుల సమాధుల కోసం బ్రిటీష్ ప్రభుత్వం సర్వే నెంబరు 9లో 46 సెంట్లు కేటాయించిందని ఆయన తెలిపారు. స్థలం చుట్టూ 27 సెంట్లు ఆక్రమించుకోగా, 19 సెంట్లు మిగిలిందని తెలిపారు. అందులో కూడా అనుమతులు అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆక్రమణలను ఆపి స్థలాన్ని అల్లూరి స్మారక ప్రదేశంగా అభివృద్ధి చేయాలని కోరారు.

స్మార్ట్ మీటర్లు వేస్తే అడ్డుకోండి

- సీపీఎం మండల కార్యదర్శి నరసింహమూర్తి

మాడుగుల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఇళ్లకు వేయడానికి వస్తే అడ్డుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఇరటా నరసింహమూర్తి పిలుపునిచ్చారు. తాటిపర్తి పంచాయతీలోని అజయ్‌పురం గిరిజన గ్రామాల్లో శనివారం ప్రజలకు కరపత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న విద్యుత్ మీటర్ల స్థానంలో కొత్తగా స్మార్ట్ మీటర్లు అమర్చేందుకు చర్యలు తీసుకున్నారని, వాటి కోసం వస్తే అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కొత్తగా బిగిస్తున్న స్మార్ట్ మీటర్ల వల్ల ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని, బిల్లులు అధికంగా రావని అధికారులు చెప్పే మాటలు నమ్మకూడదని చెప్పారు. ఇప్పటికే షాపులకు స్మార్ట్ మీటర్లు బిగించడంతో వ్యాపారులు నానా అవస్థలు పడుతున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షురాలు కె.భవాని, సభ్యులు వి.కేశవరావు, పాంగి మచ్చిరాజు, జి.పోతురాజు, రాజులమ్మ ప్రజలు పాల్గొన్నారు.

'క్వారీ ప్రభావిత గ్రామాల్లో ఫ్లోరైడ్ సమస్యతో ప్రజల ఇబ్బందులు'

రోలుగుంట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నల్లరాయి క్వారీల ప్రభావిత గ్రామాల ప్రజలు ఫ్లోరైడ్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు పేర్కొన్నారు. మండలంలోని కె.నాయుడుపాలెం గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోలుగుంట, నిండుగొండ, కె.నాయుడుపాలెం, అంట్లపాలెం, మునిపల్లి, ఎన్.కొత్తూరు, కిలపర్తిపాలెం, కొవ్వూరు, గొల్లపేటలో ఫ్లోరైడ్ అధికంగా ఉన్నట్టు వైద్యాధికారులు గుర్తించారని చెప్పారు. అధిక సంఖ్యలో కిడ్నీ సంబంధిత వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల్లో ఫ్లోరైడ్ సమస్యను అధిగమించడానికి ప్రభుత్వం జానకిరాంపురం వరహానది వద్ద రూ.3.5 కోట్లతో పనులు చేపట్టడానికి సన్నద్ధమవుతుందని ఆయన చెప్పారు.

జగన్ పాలనలో పారిశ్రామిక వేత్తలు పరార్

వైసీపీ మాజీ ఎంపీ ఎంవీవీ ఎందుకు పారిపోయారో అమర్ చెప్పాలి

పరిశ్రమల మంత్రిగా అమర్ సాధించినది గుండు సున్నా

ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు... పక్కన మల్లునాయుడు

చోడవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో పారిశ్రామిక వేత్తలను కిడ్నాప్‌లు చేసి బెదిరింపులతో పంపిస్తే, కూటమి పాలనపై నమ్మకంతో పారిశ్రామిక వేత్తలు పెట్టుబడులతో తరలిరావడం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సత్తాకు నిదర్శనమని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి పరిశ్రమలు తెచ్చిన చంద్రబాబు, లోకేశ్‌లపై మాజీ మంత్రి అమర్ చౌకబారు విమర్శలు చేయడం దారుణమన్నారు. అమర్ పరిశ్రమల మంత్రిగా ఉన్న సమయంలో పారిశ్రామిక వేత్తలు పక్కరాష్ట్రాలకు ఎందుకు పారిపోయారని ప్రశ్నించారు. అమర్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి జిల్లాలోనే ఆయన సొంత పార్టీ ఎంపీ ఎంవీవీ.సత్యనారాయణ, రాష్ట్రంలో వ్యాపారం చేయలేనని ఎందుకు వదిలేశారో అమర్ సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. నాడు ఎంపీ ఎంవీవీ భార్య, కొడుకును కిడ్నాప్ చేసి బెదిరింపులకు పాల్పడినది వైసీపీ పాలనలోనే కదా అని ఎద్దేవా చేశారు. కిడ్నాప్‌లు దందాలతో నాడు పారిశ్రామిక వేత్తలను బెదిరిస్తే, నేడు సాదరంగా ఆహ్వానించి పారిశ్రామిక వేత్తలకు సౌకర్యాలు కల్పిస్తున్న ఘనత చంద్రబాబు, లోకేశ్‌లకు దక్కుతుందన్నారు. లక్షల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమల స్థాపనతో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుంటే, పరిశ్రమల శాఖ మంత్రిగా ఒక్క పరిశ్రమ కూడా తేలేని అమర్ చౌకబారు విమర్శలతో ప్రభుత్వంపై విషం కక్కుతుండడం శోచనీయమన్నారు. అమర్‌కు పరిశ్రమల గురించి మాట్లాడే నైతిక హక్కులేదని, రాష్ట్రానికి ప్రత్యేకించి విశాఖ వస్తున్న పరిశ్రమలను చూసి మాట్లాడాలని సూచించారు. సమావేశంలో టీడీపీ ఆయకులు గూనూరు మల్లునాయుడు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీల్లో చోడవరం క్రీడాకారులకు బంగారు పతకాలు



బంగారు పతకాలు సాధించిన యోగా క్రీడాకారులు

చోడవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు శివజ్యోతి యోగా కేంద్రం ఆధ్వర్యంలో గత నెల 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ స్థాయి ఆన్‌లైన్ యోగా పోటీల్లో స్థానిక పతంజలి యోగా కేంద్రం క్రీడాకారులు పతకాలు సాధించి సత్తాచాటారు. 8 సంవత్సరాల విభాగంలో బి. సిసిరాకు బంగారు పతకం, ఓ.వాణిశ్రీకి రజత పతకం, గీతాశ్రీకి కాంస్య పతకం, డి.ఈశ్వర్ చంద్ర నాలుగో స్థానం సాధించారు. 8 నుంచి 12 ఏళ్లలోపు విభాగంలో ఓ.వర్షిని బంగారు పతకం, జి.దీక్షిత రజత పతకం, వి. ప్రియంశికి కాంస్య పతకం లభించాయి. 12 నుంచి 15 ఏళ్ల విభాగంలో ఒమ్మి శ్యాంప్రసాద్ బంగారు పతకం, జి. వర్షిని రజతపతకం, 15నుంచి 20 ఏళ్లలోపు విభాగంలో శ్రీహిత బంగారు పతకం, 20 నుంచి 25 ఏళ్ల విభాగంలో జస్వంత్ కుమార్ బంగారు పతకం, కే. రేష్మి రజత పతకం సాధించారు. ఇక 32 నుంచి 45 సంవత్సరాల విభాగంలో సంతోష్‌కుమార్ బంగారు పతకం, కె.లక్ష్మికి రజత పతకం లభించాయి. జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను యోగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుల్లేటి సతీష్ అభినందించారు.

వీఆర్వోకు సత్కారం



వీఆర్వో గౌరిని సత్కరిస్తున్న దృశ్యం

చీడికాడ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రైతులకు వీఆర్వో కోడూరు గౌరీశంకర్ చేసిన సేవలు అమోఘమని జైతవరం సచివాలయ ఉద్యోగులు అన్నారు. మండలంలోని జైతవరం వీఆర్‌వోగా పనిచేసి బదిలీపై వేరొక గ్రామానికి వెళ్లిన గౌరీశంకర్‌కు శనివారం మెమొంటోలు అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉద్యోగులు ఎస్.త్రినాథ్, ఎం.శ్రీనివాసరావు, ఎ.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

స్నేహమేరా శాశ్వతం



నేడు స్నేహితుల దినోత్సవం సందర్భంగా..

» కష్టసుఖాల్లో తోడుండే వారే నిజమైన స్నేహితులు
» నిజమైన స్నేహంలో ఈర్ష్య, ద్వేషాలకు తావులేదు
» ధనిక, పేద అనే తారతమ్యాలూ ఉండవు

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

'స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం.. స్నేహమేరా సన్నిధి.. స్నేహమేరా పెన్నిధి'.. స్నేహం గొప్పతనాన్ని మూడు ముక్కల్లో చెప్పాడో సినీ కవి. స్వచ్ఛమైన స్నేహానికి మించింది ప్రపంచంలో మరేది లేదు. శరీరాలు రెండైనా ఆత్మ ఒక్కటే అయి ఉండాలి. మనసులు రెండైనా ఆలోచనలు ఒకటే అయి ఉండాలి. అదే పరిశుద్ధమైన స్నేహం. స్నేహాన్ని కొలిచే సాధనాలు లేవు. కొలమానాలు అంతకంటే దొరకవు. స్నేహ మాధుర్యాన్ని నిర్వచించే అక్షరాలు లేవు. స్నేహం అజరామరం. మనుషులు అశాశ్వతం. స్నేహం శాశ్వతం. సృష్టి ఉన్నంత కాలం స్నేహం ఉంటుంది. స్నేహితుడు ఉంటాడు. స్నేహంలో ఉండే ఆర్ద్రత, మాధుర్యాన్ని ఆస్వాదించగలిగిన వారే నిజమైన స్నేహితులు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ప్రతిఒక్కరి జీవితంలో తల్లిదండ్రులు, సోదరులు, అక్కాచెల్లెల్లు, పిల్లలు వంటి బంధాలు ఉంటాయి. ఈ బంధాలతో సమానంగా నిలిచే మరో బంధమే స్నేహం. అందరి జీవితంలో స్నేహానికి ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. మంచి స్నేహితుడు తోడుంటే జీవితంలో ఎన్నో విజయాలు సాధించేందుకు అవకాశం ఉంది. మంచి స్నేహాల వల్ల ఉన్నత స్థానాలకు చేరుకున్న వాళ్లు ఉన్నట్టే.. చెడు స్నేహాలతో పతనాన్ని చవిచూసిన వాళ్లూ ఉన్నారు. కాబట్టి స్నేహితుడి ఎంపిక కూడా అత్యంత కీలకం. చెడు సావాసాలు జీవితాలను నాశనం చేస్తాయని పెద్దలు చెబుతుంటారు. అలాగే మంచి స్నేహితుడు ఉన్నత స్థానాలను చేరుకునేందుకు దోహదం చేస్తాడనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. కాబట్టి కష్టసుఖాల్లో అండగా నిలిచే మంచి స్నేహితుడిని పొందడం అదృష్టంగానే భావించాలి. జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు, కష్టసుఖాల్లో అండగా నిలిచిన స్నేహితులను గుర్తు చేసుకోవాలనే ఉద్దేశంతోనే ఏటా ఆగస్టు నెలలో వచ్చే తొలి ఆదివారాన్ని స్నేహితులు దినోత్సవంగా జరుపుకుంటున్నాం.



1935లో ఆగస్టు మొదటి శనివారం అమెరికా ప్రభుత్వం చేతిలో ఒక వ్యక్తి మృతి చెందాడు. తన స్నేహితుడి మరణాన్ని జీర్ణించుకోలేక మరో వ్యక్తి ఆ మరుసటి రోజైన ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనకు చలించిన అమెరికా ప్రభుత్వం 1935లో యునైటెడ్ స్టేట్స్ కాంగ్రెస్ ఆగస్టు మొదటి ఆదివారాన్ని జాతీయ స్నేహితుల దినోత్సంగా ప్రకటించింది. అప్పటినుంచి క్రమంగా అనేక దేశాలు స్నేహితులు దినోత్సవాన్ని జరుపుకుంటున్నాయి.

స్నేహితుడు ఎలా ఉండాలంటే..

స్నేహితుడు ఎలా ఉండాలన్న దానిపై భిన్నమైన అభిప్రాయాలు ఉన్నాయి. అయితే నిజమైన స్నేహితుడు ఎప్పుడూ నమ్మకమైన వాడిగా ఉండాలి. సహాయం చేయడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి. కష్టసుఖాల్లో నిరంతరం తోడుగా ఉండేవాడిని మాత్రమే స్నేహితుడిగా భావించాలి. స్నేహితుడి ఎదుగుదలను, మంచిని కోరుకునే వ్యక్తే నిజమైన స్నేహితుడు అని చెబుతారు. స్నేహితుడు చేసే మంచి, చెడులను నిర్మొహమాటంగా చెప్పి సరైన మార్గంలో నడుచుకునేలా చేస్తాడు. స్నేహితులు మధ్య దాపరికాలు ఉండవు. ఒకరి పట్ల ఒకరికి ప్రేమ, ఆప్యాయత, అభిమానాలు మాత్రమే ఉంటాయి. నిజమైన స్నేహంలో ఈర్ష్య, ద్వేషాలకు తావు లేదు... ధనిక, పేద అనే తారతమ్యాలూ ఉండవు.



చాంతాడ జాబితా వద్దు

ప్రస్తుతం యువత స్నేహితులు చిట్టా చూస్తే చాంతాడంతా ఉంటోంది. ఊరు, పేరు, ముఖం తెలియనివాళ్లు కూడా ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా స్నేహాలు చేస్తున్నారు. ఇటువంటి వారిని స్నేహితులుగా ఎంతోమంది భావిస్తున్నారు. అయితే ఇటువంటి స్నేహాల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని, ఈ తరహా స్నేహితులతో మోసాలకు గురయ్యే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. వందలకొద్దీ స్నేహితుల జాబితా ఉన్నప్పటికీ కష్ట, సుఖాల్లో అండగా లేనప్పుడు ప్రయోజనం లేదన్నది పెద్దల మాట. అందువల్ల మంచి కోరుకునే ఇద్దరు, ముగ్గురు నిజమైన స్నేహితులుంటే చాలు. అటువంటి స్నేహితులను ఎంపిక చేసుకోవడం అత్యంత కీలకం.



సంబరాలు నిర్వహించుకునేలా..

స్నేహితుల దినోత్సవం రోజు ఇష్టమైన స్నేహితులకు బహుమతులు అందించి సెలబ్రేట్ చేసుకుంటారు. నగరంలోనూ స్నేహతుల దినోత్సవాన్ని జరుపుకునేందుకు యువత సిద్ధమవుతున్నారు. ఏళ్లతరబడి స్నేహాన్ని కొనసాగిస్తున్న ఎంతోమంది స్నేహితుల దినోత్సవం రోజున నగర పరిధిలోని కొన్ని ముఖ్యమైన ప్రదేశాల్లో కలుకుసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే నగరంలో స్నేహితుల దినోత్సవ సందడి ప్రారంభమైంది. వివిధ రకాల గిఫ్ట్‌లు, స్పెషల్ కేక్స్, స్వీట్స్ వంటివి సిద్ధం చేసి 'ఫ్రెండ్‌షిప్ డే' స్పెషల్ పేరుతో విక్రయాలు సాగిస్తున్నారు. తమకు ఇష్టమైన స్నేహితుడికి మంచి బహుమతిని అందించేందుకు ఎంతోమంది వాటిని కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఆయా గిఫ్ట్ స్టోర్స్ వద్ద సందడి వాతావరణం నెలకొంది.

ఎటువంటి లక్షణాలు ఉండాలంటే..

మంచి స్నేహితుడు ఎప్పుడూ కొన్ని సద్గుణాలను కలిగి ఉండాలి. స్నేహితుడిలో కొన్ని మంచి లక్షణాలను చూసుకోవాలి. అటువంటి లక్షణాలు ఉన్నవారితో సాన్నిహిత్యంగా ఉండడం కీలకం. మన హితాన్ని కోరుకునే వాడై ఉండాలి. తప్పు, ఒప్పులను నిర్మొహమాటంగా చెప్పాలి. ఆలోచనలు, అభిరుచులు కలిసిన స్నేహితులతో స్వీయాభివృద్ధి ఎక్కువగా ఉంటుంది. ఆర్థిక అవసరాలు, ఇతర అవకాశాల కోసం చూసేవారిని ఎప్పుడూ స్నేహితులుగా భావించరాదు. దురలవాట్లతో కూడిన వ్యక్తులతో స్నేహం జీవితాన్ని ప్రమాదంలోకి నెడుతుంది. జీవితం పట్ల, లక్ష్యం పట్ల స్పష్టత ఉన్న వ్యక్తులు, దూరదృష్టి కలిగిన వారిని స్నేహితులుగా ఎంపిక చేసుకోవడం ఎంతో మంచిది.

'సుఖీభవ'తో రైతుల్లో ఆనందం

» స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడి

మాకవరపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకంతో రైతులు ఆనందంగా ఉన్నారని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్నదాత సుఖీభవ పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఏడాదికి రూ.13వేలు ఇచ్చి గొప్పలు చెప్పుకునేదన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఏడాదికి రూ.20వేలను మూడు విడతలుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. ప్రతి మండలానికి ఎరువులు వేసేందుకు ఒక డ్రోన్‌ను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పెండింగ్ పెట్టిన రూ.13 వేల కోట్ల బకాయిలను కూటమి ప్రభుత్వం రైతులకు చెల్లించిందని గుర్తుచేశారు. మాకవరపాలెం మండలంలో 8,957 మంది రైతులకు రూ.6 కోట్లు సుఖీభవ పథకం కింద బ్యాంకు ఖాతాల్లో పడుతున్నాయన్నారు.

తాళ్లపాలెం వంతెనను కాపాడుకోవాలి

తాళ్లపాలెం వంతెన కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపైన ఉందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. అధిక లోడుతో వస్తున్న వాహనాలను అరికట్టకపోతే వంతెన కూలిపోతుందని, దీనివల్ల మాకవరపాలెం మండలానికి తీవ్ర నష్టం వస్తుందన్నారు. రాజుపేట వద్ద చెక్‌పోస్టు పెట్టి అధికలోడుతో వస్తున్న వాహనాలను చెక్ చేసి పెనాల్టీ విధించేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డీవో, సీఐలకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో రమణ, తహశీల్దార్ వెంకటరమణ, సీఐ రేవతమ్మ, తాండవ నీటి సంఘం చైర్మన్ కరక సత్యనారాయణ, నర్సీపట్నం ఏఎంసీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, జనసేన ఇన్‌చార్జి సూర్యచంద్ర, మాకవరపాలెం సర్పంచ్ అల్లంపల్లి శిరీషా, టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు, తామరం పీఏసీఎస్ చైర్‌పర్సన్ చినబాబు, బీజేపీ నాయకుడు మర్రినాయుడు, వ్యవసాయాధికారి అప్పారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నేతన్న జీవితాల్లో వెలుగు

... 5వ పేజీ తరువాయి

ఏపీఈపీడీసీఎల్ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. 200 యూనిట్లు దాటి విద్యుత్ వినియోగించే నేతన్నలు అదనంగా వినియోగించిన విద్యుత్‌కు మాత్రమే బిల్లు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో పాయకరావుపేట, నర్సీపట్నం, నక్కపల్లి, కశింకోట, కె.కోటపాడు మండలాల్లో చేనేత కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయి. వారు చేనేతపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇప్పటికే చేనేత కుటుంబాల వివరాలను సేకరిస్తున్న జిల్లా చేనేత, జౌళి శాఖాధికారులు త్వరలోనే అర్హులకు ఉచిత విద్యుత్ పంపిణీ జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆర్ఈసీఎస్ ఉద్యోగులకు షాక్

... 5వ పేజీ తరువాయి

ఈపీడీసీఎల్ అధికారులు 'రేషనలైజేషన్' పేరుతో దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టారు. ఎవరైతే అడ్డగోలుగా ఇంక్రిమెంట్లు, పదోన్నతులు తీసుకున్నారో జాబితా రూపొందించి, వారికి అర్హతల ప్రకారమే జూలై నెల జీతాలు ఇచ్చారు. ఇకపై అవే జీతాలు ఇస్తామని స్పష్టంచేశారు. సగటున ఒక్కొక్కరికి రూ.15 వేలు తగ్గిపోయింది. ఇప్పటివరకూ అడ్డగోలుగా, అదనంగా తీసుకున్న జీతాలను ఎలా రికవరీ చేయాలనే దానిపైనా కసరత్తు చేస్తున్నారు.

నంబర్ వన్ నానాజీ

... 5వ పేజీ తరువాయి

కొంతకాలం మాత్రమే ఉంటాయి. మిగతా సమయాల్లో తండ్రి మేకలు కాసి వచ్చిన ఆదాయంతో గడిపేవారు. నానాజీ ఏడవ తరగతి వరకు దొప్పెర్ల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదివాడు. పదవ తరగతి వరకు పరవాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివాడు. డిప్లొమా ఆనందపురంలోని ప్రైవేటు కళాశాలలో పూర్తిచేశాడు. బీటెక్ దువ్వాడలో 2020లో పూర్తి చేశాడు. తరువాత ఎస్ఐ ఉద్యోగం సాధించాలని శిక్షణ తీసుకున్నాడు. తొలి ప్రయత్నంలో ఎస్ఐ ఉద్యోగానికి ఎంపిక కాలేదు. అయితే ఈసారి కానిస్టేబుల్ పరీక్షల్లో 200లకు 168 మార్కులు సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించాడు. తాము పడిన కష్టానికి నానాజీ న్యాయం చేశాడని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ కుమారుడికి చదువుపైనే ధ్యాస అని, రేయింబవళ్లు కష్టపడి చదివాడని వారు తెలిపారు. కాగా ఈసారి ఎస్ఐ పరీక్ష రాస్తానని, అలాగే గ్రూప్-1కు కూడా ప్రిపేర్ అవుతున్నానని నానాజీ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపాడు.



తల్లిదండ్రులతో నానాజీ

కానిస్టేబుల్ ఉద్యోగ ఫలితాల్లో యువత సత్తా

కాబోయే భార్యాభర్తలు ఎంపిక

రావికమతం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ పరీక్షా ఫలితాల్లో యువతీ, యువకులు సత్తా చాటారు. గుడివాడ పంచాయతీ శివారు పిల్లవానిపాలెం, కొట్నాపల్లికి చెందిన కాబోయే భార్యాభర్తల జంట ఈ పోస్టులకు ఎంపికయ్యారు. పేద కుటుంబాలకు చెందిన అమ్మాజీ 120 మార్కులతో సివిల్ పోలీస్‌గాను, వంతాల అశోక్ 113 మార్కులతో ఏపీఎస్పీ కానిస్టేబుల్‌గా అర్హత సాధించారు. వీరిద్దరూ ప్రభుత్వ విద్యాలయాల్లోనూ చదువుకున్నారు. మరో పది రోజుల్లో నిశ్చితార్థం జరగనున్నది. పోలీసు శిక్షణ పూర్తయిన వెంటనే వివాహం చేసుకుంటామని ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో అమ్మాజీ, అశోక్ చెప్పారు.



అమ్మాజీ, అశోక్

వరహాపురం యువకుడి ఎంపిక

చీడికాడ: మండలంలో వరహాపురం గ్రామానికి చెందిన ధర్మిశెట్టి సురేశ్ మంచి మార్కులు సాధించాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన సురేశ్ 158 మార్కులతో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. ఎస్ఐ పోస్టుకు ప్రయత్నించి రెండు మార్కుల్లో తప్పిపోయానని, గ్రూప్-1, గ్రూప్-2కు ఎంపిక కావడమే లక్ష్యమని ఆయన చెప్పారు.



సురేశ్

రైవాడ విద్యార్థి దేమున్నాయుడు ప్రతిభ

దేవరాపల్లి: రైవాడ గ్రామానికి చెందిన వాండ్రాసి దేమున్నాయుడు కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. 118.5 మార్కులతో ఈ పోస్టుకు అర్హత సాధించాడు. ఎస్ఐ పోస్టు సాధించడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా దేమున్నాయుడు చెప్పారు.



తిరుపతి, చర్లపల్లి ప్రత్యేక రైళ్లు కొనసాగింపు

విశాఖపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రానున్న పండుగలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక వారాంతపు రైళ్లను సెప్టెంబరు నెలాఖరు వరకూ నడపాలని నిర్ణయించినట్టు డీసీఎం కె.సందీప్ తెలిపారు.

విశాఖ-తిరుపతి (08547) ప్రత్యేక రైలు ఈ నెల 6 నుంచి సెప్టెంబరు 24 వరకు, తిరుపతి-విశాఖ (08578) ప్రత్యేక రైలు ఈ నెల 7 నుంచి సెప్టెంబరు 25 వరకు నడుపుతామన్నారు. విశాఖ-చర్లపల్లి (08579) ప్రత్యేక రైలు ఈ నెల 8 నుంచి సెప్టెంబరు 26 వరకు, చర్లపల్లి-విశాఖ (08580) ప్రత్యేక రైలు ఈ నెల 9 నుంచి సెప్టెంబరు 27 వరకు నడుపుతామని పేర్కొన్నారు.

క్రైం... crime news

370 కిలోల గంజాయి స్వాధీనం

» విలువ రూ.కోటి పైనే..
» నలుగురి అరెస్టు.. మరో నలుగురు పరారీ
» రెండు కార్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం
» నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు

మాకవరపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో 370 కిలోల గంజాయితో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పక్క సమాచారంతో భారీగా గంజాయిని పట్టుకున్నామన్నారు. మండలంలోని రాచపల్లి సెంటర్ వద్ద శుక్రవారం రాత్రి ఎస్ఐ దామోదరనాయుడు, సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తున్నారని, అదే సమయంలో ఒక ద్విచక్ర వాహనం, రెండు కార్లు నుంచి ఎనిమిది మంది పారి పోవడానికి ప్రయత్నించారన్నారు. ఎస్ఐ దామోదర్‌నాయుడు వారిని పట్టుకోవడానికి ప్రయత్నించగా.. నలుగురు వ్యక్తులు దొరికారని, మరో నలుగురు పారిపోయారన్నారు. పట్టుబడిన వ్యక్తుల నుంచి ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం కార్లు తనిఖీ చేయగా.. ఒక కారులో పది బస్తాలు, మరో కారులో ఐదు బస్తాలతో గంజాయి దొరికిందన్నారు. ఈ సందర్భంగా నర్సీపట్నంలోని ధనిమిరెడ్డి వీధికి చెందిన బంగారు శివ(28), రోలుగుంట మండలం ఎంకేపట్నంకి చెందిన సబ్బవరపు నాయుడు (26), రోలుగుంట మండలం సర్పవరం గ్రామానికి చెందిన పంచాడ అప్పలనాయుడు (37), నర్సీపట్నం మండలం నీలంపేటకి చెందిన పోలిరెడ్డి ప్రసాద్(27)లను అరెస్టు చేశామన్నారు. మరో నలుగురు వ్యక్తులు పరారీలో ఉన్నారని, వారిని కూడా పట్టుకుంటామని డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ గంజాయిని ఒడిశా రాష్ట్రం చిత్రకొండ వద్ద రూ.18 లక్షలకు కొనుగోలు చేసి, అక్కడ నుంచి ప్రైవేటు వాహనంలో చింతపల్లి మండలం అంజలి శనివారం గ్రామానికి తరలించారన్నారు. అక్కడ నుంచి కొంతమంది గిరిజనులతో గంజాయిని నడక మార్గం ద్వారా పాలమామిడి, ఎంబీపట్నం మీదుగా రోలుగుంట మండలం నిండుగొండ గ్రామానికి తరలించారన్నారు. అక్కడి నుంచి తాళ్లపాలెం ఎన్‌హెచ్16 రోడ్డుకి తరలిస్తుండగా పట్టుబడ్డారన్నారు. పట్టుబడిన 370 కిలోల గంజాయి విలువ కోటి రూపాయల పైబడి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా మాకవరపాలెం ఎస్ఐ దామోదర్‌నాయుడు, గొలుగొండ, నర్సీపట్నం ఎస్ఐలను అభినందించారు. విలేకర్ల సమావేశంలో సీఐ రేవతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడ్డ గంజాయితో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ రేవతమ్మ

కశింకోటలో 262 కిలోలు...

» నలుగురి అరెస్టు » పరారీలో మరో ముగ్గురు నిందితులు

కశింకోట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి తమిళనాడుకు వ్యాన్‌లో తరలిస్తున్న 262 కిలోల గంజాయిని కశింకోట పోలీసులు శనివారం పట్టుకున్నారని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి తెలిపారు. కశింకోట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె ఈ వివరాలు వెల్లడించారు. ముందుగా అందిన సమాచారం మేరకు సీఐ అల్లు స్వామినాయుడు నేతృత్వంలో పోలీసులు కశింకోట సత్తెమ్మతల్లి ఆలయం వద్ద శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారన్నారు. ఆ సమయంలో అటుగా వస్తున్న వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా 131 ప్యాకెట్లలో 262 కిలోల గంజాయి దొరికిందని చెప్పారు. దీనికి సంబంధించి అల్లూరి జిల్లా పెదబయలు మండలం బొంగారం పంచాయతీ డొమలొద్దు గ్రామానికి చెందిన అనుగూరి కొండబాబు, సిరికి రాఘవ, బండారు గణేశ్, అనుగూరి సోమేశ్‌కుమార్‌లను అరెస్టు చేసినట్టు చెప్పారు. మరో ముగ్గురు పరారయ్యారన్నారు. నిందితుల నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, వ్యాన్, ద్విచక్రవాహనం, రూ.3,200ల నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. పరారైన వారిలో అల్లూరి జిల్లా డొమలొద్దు గ్రామానికి చెందిన గూడా బొజ్జనాయుడు, ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా పనికిబండ గ్రామానికి చెందిన వంతల దనుర్జయ్, తమిళనాడు ప్రాంతానికి చెందిన రమేశ్‌లు ఉన్నారేనని, వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ కె.లక్ష్మణరావు, మనోజ్‌కుమార్, సిబ్బందిని ఆమె అభినందించారు.



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఎం.శ్రావణి

పాత శ్లాబ్ తొలగిస్తుండగా ఒకరి మృతి

» మరొకరికి తీవ్ర గాయాలు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తూరు పంచాయతీలో శనివారం సాయంత్రం పాత ఇంటి శ్లాబ్ తొలగించే క్రమంలో అకస్మాత్తుగా శ్లాబు కూలిపోయి ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుచ్చెయ్యపేట మండలానికి చెందిన మామిడివాడ దేముడు, దాలిబోయిన అప్పారావు ఓ పాత ఇంటి శ్లాబ్ తొలగించే పని ఒప్పుకున్నారు. శనివారం సాయంత్రం వీరు పని చేస్తుండగా శ్లాబ్ ఒక్కసారిగా కూలిపోయి వారిపై పడిపోయింది. దీంతో దేముడు అక్కడికక్కడే మృతి చెందగా, అప్పారావు తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన అప్పారావును ఎన్టీఆర్ వైద్యాలయానికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. దీనిపై ఇంకా ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



డీఆర్‌వోకు వినతిపత్రం అందిస్తున్న ఫ్యాప్టో సభ్యులు

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఫ్యాప్టో చైర్మన్ బోయిన చిన్నారావు డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు ఉపాధ్యాయుల సమస్యలపై కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారావు మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాలకు దూరంగా ఉంచాలని, 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించి ఐఆర్ 30 శాతంను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో బదిలీ అయిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో సెక్రటరీ సుధాకర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం డీఆర్‌వో వై.సత్యనారాయణరావును వినతిపత్రం అందజేశారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	83.00
లైవ్ ధర	103.00
విత్ స్కిన్	176.00
స్కిన్ లెస్	186.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469